

ఉష్ణోగ్రత (అంచనా) 18-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	37	27
తెనాలి	36	28
నరసరావుపేట	36	26
బాపట్ల	35	28
రెంటచింతల	37	27
చీరాల	35	28



- నియోజకవర్గాల విజన్-2047కు కసరత్తు
- ఎమ్మెల్యే చైర్మన్‌గా కొలువు దీరనున్న బృందం
- సభ్యులుగా ఐదుగురు సచివాలయ ఉద్యోగులు
- విభాగాల వారీగా ప్రతి నెలా ప్రభుత్వానికి నివేదికలు

అభివృద్ధి దిశగా.. అడుగులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వస్తోంది. క్షేత్రస్థాయిలో సమస్యలు.. శాఖల వారీగా కార్యక్రమాల తీరుతెన్నులు.. ప్రజల సంతృప్తి.. తదితరాల ఆధారంగా నియోజకవర్గాల వారీగా ప్రణాళికలపై ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. స్వర్ణాంధ్ర-2047 సాకారం కావాలంటే ముందుగా క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వం తలంచింది. ఇందులో భాగంగానే నియోజకవర్గాల వారీగా కసరత్తుకు శ్రీకారం చుట్టింది. నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలపై ప్రభుత్వం తొలుత దృష్టి పెట్టనుంది. దీనికి సమాంతరంగా అక్కడ ఉన్న వనరులు.. ఏ రంగంలో ఉపాధి కల్పనకు అవకాశం ఉంది.. ఇందుకోసం ప్రభుత్వం నుంచి అందాల్సిన సహకారం .. తదితర అంశాల ప్రాతిపదికగా కసరత్తు చేయనున్నారు. విజన్-2047లో భాగంగా నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే పాత్రను కీలకం చేస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో ఎమ్మెల్యే చైర్మన్‌గా, నియోజకవర్గ కేంద్ర ఎంపీడీవో కన్వీనర్‌గా, ఐదుగురు సచివాలయ ఉద్యోగులు సభ్యులుగా ప్రత్యేక బృందం పనిచేయనున్నది. ఇందుకోసం ఐదుగురు సచివాలయ ఉద్యోగులను డిప్యూటేషన్‌పై నియోజకవర్గ కేంద్రంలో నియమించి నిరంతర పర్యవేక్షణ చేపట్టనుంది. సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను సైతం మూడు జిల్లాల పరిధిలో అధికారులు పూర్తి చేశారు. ఇక నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేకంగా ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆయా విభాగాలు తయారు చేసే సవివర ప్రణాళికలను ముందుగా ఎమ్మెల్యేతో వాటి సాధ్యాసాధ్యాలపై చర్చించి నివేదికలను ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. పేదరిక నిర్మూలనతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పన, చివరి ఆయకట్టు వరకు సాగునీరు, గిట్టుబాటు ధరలే తొలి ప్రాథమ్యాలుగా ఉండనున్నాయి. ప్రతినెలా ఆయా కార్యక్రమాల అమలు నివేదికలను ప్రభుత్వానికి పారదర్శకంగా అందించాల్సిన బాధ్యతను సదరు బృందంపైనే ఉంది. నియోజకవర్గాల వారీగా ఇప్పటికే ప్రత్యేక అధికారుల నియామకం జరిగింది. వీరు కూడా బృందంతో కలిసి అడుగు లేయనున్నారు. ఇప్పటికే ప్రతి నెలా మూడో శనివారం ఓ థీమ్‌ను ఎంపిక చేసుకుని స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్ర మం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దానిని మొక్కుబడి తంతుగా మార్చేయకుండా దాని ద్వారా వచ్చిన ఫలి తాలపై కూడా ప్రతి మూడు నెలలకొకసారి నియోజకవర్గ బృందాలతో సమీక్షించి సూచనలు చేసే దిశగా కూడా ప్రభుత్వం అడుగులేస్తోంది.

దాదాపు 110 మంది సచివాలయ ఉద్యోగులు..

ఇందుకోసం బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు 110 మంది సచివాలయ ఉద్యోగులను డిప్యూటేషన్‌పై నియమించనున్నారు. అయితే ప్రభుత్వం సచివాలయాల రేషనలైజేషన్‌కు శ్రీకారం చుట్టినందున ఆయా నియోజకవర్గాల్లో వారి నియామకాల ప్రక్రియకు కొంత ఆటంకం కలుగుతున్నట్లు అధికారుల చెప్తున్నారు. గుంటూరు జిల్లాలో రెండు, బాపట్లలో మూడు, పల్నాడు జిల్లాలో మూడు నియోజకవర్గాలకు ఇంకా ఉద్యోగుల నియామకం జరగలేదంటున్నారు. ఈ నియామక గడువు ఏడాది ఉంటుందని, ఇప్పటికే రెండు బ్యాచ్‌లకు శిక్షణ ముగించామని అధికారులు చెబుతున్నారు.

మట్టి పరీక్షలు.. మొక్కుబడిగా..



సరికొండ పాలెంలో మట్టి నమూనా సేకరణ

నానాటికీ నిస్సారంగా మారుతున్న నేల తల్లిని రక్షించి రైతులకు లబ్ధి చేకూరేలా భూసార పరీక్షలను చేపట్టాలి. ఇందుకు సంబంధించి కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి జిల్లాల వారీగా లక్ష్యాలు నిర్దేశించింది. సాగుకు రైతులు సన్నద్ధమయ్యే నాటికి భూసార పరీక్షలు పూర్తి చేసి భూ ఆరోగ్య కార్డులు అందజేయాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖను ఆదేశించింది. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో లక్ష్యంలో అర శాతం కూడా చేయ లేదు. మొక్కుబడిగా మట్టి నమూ నాలు సేకరించారే కానీ పరీక్షల విషయంలో పూర్తిగా అలసత్వం వహిస్తున్నారని వ్యవసాయశాఖ లెక్కలు సూచిస్తున్నాయి. సాగుకు సమయం ఆసన్న మవుతున్న తరుణంలో భూసార పరీక్షల కార్డుల కోసం రైతులు ఎదురు చూస్తున్నా వ్యవసాయ శాఖలో చలనం లేదు. మట్టి పరీక్షలకు ఈ నెల 15న గడువు కాగా ఇప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. మూడు జిల్లాల పరిధిలో 60,124 మట్టి నమూనాలను సేకరించి పరీక్ష చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. అయితే ఇప్పటికి కేవలం 391 పరీక్షలు మాత్రమే పూర్తయినట్లు వ్యవసాయశాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి.

- పుడమి ఆరోగ్య పరీక్షల్లో అలసత్వం
- మూడు జిల్లాల్లో 60,124 పరీక్షల లక్ష్యం
- ఇప్పటికి 391 నమూనాల పరీక్షలు మాత్రమే పూర్తి
- గడువు దాటినా వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

భూసార పరీక్షలను యజ్ఞంలా చేయాలని ప్రభుత్వం సంకల్పించగా ఆచరణలో అది అమలు కావడంలేదు. మట్టి నమూనాలను సేకరిస్తున్నారే తప్ప పరీక్షలు నిర్వహించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ నెల 15 కల్లా భూసార పరీక్షలు పూర్తి చేసి రైతులకు పుడమి ఆరోగ్య కార్డులు పంపిణీ చేయాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖను ఆదేశించింది. అయితే గడువు దాటినా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పరీక్షలు జరుగుతున్న తీరు పరిశీలిస్తే పంటల సాగు ప్రారంభం నాటికి పూర్తయ్యే పరిస్థితులు కూడా కానరావడం లేదు. పరీక్షలే సక్రమంగా జరపలేదంటే ఇక రైతులకు ఏమాత్రం భూసార పరీక్షల కార్డులు అందాయో తెలుసుకోవచ్చు. పంటల సాగులో భూసార పరీక్షలు కీలకం. భూమిలో సారం ఎంత ఉందో పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. నేలలో పోషకాలు ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. ఆ మేరకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు సూచిస్తారు. అదే విధంగా ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో రైతులకు తెలియజేస్తారు. నేల ఆరోగ్య పరీక్షలు ఆధారం గానే పంట సాగు చేయాలని ప్రభుత్వం రైతులకు సూచిస్తోంది. భూసారం బాగుంటేనే పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. ఇంతటి ప్రాధాన్య పరీక్షలపై రైతులు ఆసక్తి చూపుతున్నా వ్యవసా యశాఖలో నిర్లక్ష్యం కనిపిస్తోంది.

ఇలా సాగితే ఏడాదైనా కష్టమే..

పల్నాడు జిల్లాలో 23,437 మట్టి నమూనాల పరీక్షల చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. 18,158 మట్టి నమూనాలను సేకరించి 388 మట్టి నమూనాలను పరీక్షించి సాయిల్ హెల్త్ కార్డులను సిద్ధం చేశారు. అంటే 2.10 శాతం మాత్రమే మట్టి నమూనాల పరీక్షలు మాత్రమే పూర్తయ్యాయి. బాపట్ల జిల్లాలో 22,825 మట్టి నమూనాల పరీక్షల లక్ష్యం కాగా ఇప్పటికి 14,287 నమూనాలను సేకరించి రెండింటికి పరీక్షలు పూర్తి చేసినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. గుంటూరు జిల్లాలో 13,882 మట్టి నమూనాలను పరీక్షించాలని లక్ష్యం కాగా ఇప్పటికి 9,784 నమూనాలను సేకరించి ఒక్క నమూనా పరీక్ష మాత్రమే చేశారు. ఇలా మూడు జిల్లాల పరిధిలో సేకరించిన నమూనాల పరీక్షలకు ఇంకెన్ని రోజుల సమయం తీసుకుంటారో వ్యవసాయ శాఖ అధికారులకే తెలియాలి. పరీక్షలు ఇలా కొనసాగితే ఏడాదికి కూడా పూర్తి చేయడం అసాధ్యమని రైతులు చెప్తున్నారు. కనీసం పరీక్షలను వేగవంతం చేసి జూన్ కన్నా భూఆరోగ్య కార్డులు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

భూసార కార్డులు ఉంటేనే సూక్ష్మపోషకాలు

సూక్ష్మ పోషకాల లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, భాస్వరం, నత్రజని, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు పంటలకు అవసరం. రాయితీపై సూక్ష్మపోషకాల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమైంది. అయితే ఆయా సూక్షపోషకాల పంపిణీకి భూసార కార్డులను తప్పనిసరి చేసింది. ఆయా కార్డుల్లో సూచించిన మేర సూక్ష్మ పోషకాలను రాయితీపై అందించనున్నా.. ఆ కార్డులు పంపిణీ ఇంతవరకు జరగలేదు. ఈ పరిస్థితుల్లో రైతులకు సకాలంలో సూక్షపోషకాలు ఏమేరకు అందుతాయో తెలియాల్సి ఉంది.

జిల్లా	పరీక్షల లక్ష్యం	నమూనాల సేకరణ
పల్నాడు	23,437	18,158
బాపట్ల	22,825	14,287
గుంటూరు	13,862	9,784



ఉప్పలపాడులో మట్టి నమూనాల సేకరణ

సిందూర్‌కు.. సంఘీభావం

- గుంటూరు, తెనాలిలో భారీ తిరంగా ర్యాలీలు
- భరత మాత గర్వపడేలా ఆపరేషన్ సిందూర్
- సిందూరం సంప్రదాయం కాదు.. బలమైన సంకల్పం
- ర్యాలీల్లో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



గుంటూరు : భరతమాతకు జై..



గుంటూరు : ర్యాలీలో స్కేటింగ్ చేస్తూ..



తెనాలిలో తిరంగా యాత్ర ర్యాలో పెమ్మసాని, మనోహర్, ఆలపాటి



గుంటూరు(తూర్పు), తెనాలి, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా శనివారం గుంటూరు, తెనాలిలో భారీ తిరంగా ర్యాలీలు జరిగాయి. కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలు ప్రజల్లో స్ఫూర్తి, ఐక్యతను నింపాయి. వందేమాతరం, జై భరతమాత నినాదాలు.. మువ్వెన్నెల జెండాలతో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, విద్యార్థులు, విశ్రాంత సైనికులు పెద్దసంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. గుంటూరులో మార్కెట్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ శంకర విలాస్ బ్రిడ్జి మీదగా లాడ్జి సెంటర్ అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. విద్యార్థులు, యువత ప్రదర్శించిన 75 మీటర్ల జాతీయ పతాకం ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తొలుత హిందూ కళాశాల ఎదురుగా ఉన్న సైనికుల అమరవీరుల స్థూపానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ సిందూరం అంటే దేశ సంప్రదాయం కాదు.. అది బలమైన సంకల్పమన్నారు. ఇదే దేశ సంప్రదాయాన్ని, భూమిని, భవిష్యత్తును కాపాడుతుందన్నారు. దేశ ఐక్యతను దెబ్బతీయాలని ఉగ్రవాదులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారని, కాకపోతే భారత్ ఉదయిస్తుందే గాని, తల వంచదనే విషయాన్ని తెలుసుకోలేకపోయారన్నారు. స్థితప్రజ్ఞత కలిగిన మోదీ సరైన సమయంలో ఆపరేషన్ సిందూర్ పేరుతో సైన్యాన్ని రంగంలోకి దింపి మూడు రోజుల్లో పాకిస్తాన్‌కు వెన్నులో వణుకు పుట్టించేలా చేశారన్నారు. రాష్ట్రానికి చెందిన మురళీనాయక్ వీరోచితంగా పోరాడారన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌ను ప్రజలందరూ హర్షిస్తున్నారన్నారు. ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్ మాట్లాడుతూ దేశ ఐక్యతను, స్ఫూర్తిని దెబ్బతీయాలనుకుంటే ఇటువంటి గుణపాఠాలు చెబుతామన్నారు. ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ భారత సైన్యం పాకిస్తాన్‌కు సరైన సమయంలో సరైన బుద్ధి చెప్పిందన్నారు. మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ సైనికులకు వారి కుటుంబాలకు అండగా నిలబడాలన్నారు. ర్యాలీకి బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, టీడీపీ నాయకులు దాసరి రాజామాస్టారు. కనపర్తి శ్రీనివాసరావు, షేక్ లాల్ వజీర్, బీజేపీ నాయకులు జూపూడి రంగారాజు, నూకల మధుకర్‌జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర వెంకటశివన్నారాయణ, డాక్టర్ శనక్కాయల అరుణ, నేరేళ్ల మాధవరావు, చరక కుమార్‌గౌడ్, వై.వి.సుబ్బారావు, తోట రామ కృష్ణ, వెలగ లేటి గంగాధర్, పాండురంగ విట్టల్, షేక్ అబ్దుల్ ఖుద్దుస్, రాచుమల్లు భాస్కర్, రోశయ్య, మైలా హరికృష్ణ పాల్గొన్నారు.



తిరంగా యాత్రలో పాల్గొన్న పెమ్మసాని చంద్రశేఖర్, బూర్ల రామాంజనేయులు, నసీర్ , కోవెలమూడి రవీంద్ర, డేగల ప్రభాకర్, జయప్రకాష్ నారాయణ

తెనాలిలో..

తెనాలిలో జరిగిన తిరంగా ర్యాలీలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్రావు తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలో ఎన్నారై విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 300 మీటర్ల జాతీయ జెండా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక చినరావూరు పార్కు నుంచి మార్కెట్ సెంటర్‌లోని మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌తో మన దేశ సత్తాను ప్రపంచ దేశాలకు తెలియచేశామన్నారు. భరతమాత గర్వపడేలా పాక్ ఉగ్రమూకలను మట్టుపెట్టటం గర్వించదగిన విషయమన్నారు. ఉగ్రవాదాన్ని అణచివేయడంలో సత్తాచాటిన సైనికులకు వందనం చెబుతూ, యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు రుణపడి ఉంటామని సెల్యూట్ చేశారు.



75 మీటర్ల జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న యువత



పోలీసు హెడ్‌క్వార్టర్స్ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

మొక్కలతో ఆరోగ్యకర సమాజం

- పర్యావరణహితంగా పోలీసు స్టేషన్లు
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

మంగళగిరి, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా పిలుపునిచ్చారు. శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు హెడ్‌క్వార్టర్స్ ప్రాంగణంలో కుటుంబ సభ్యులు, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి డీజీపీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పోలీసు స్టేషన్ ఆవరణలో ప్రతి నెలా మూడో శనివారం మొక్కలు నాటి, పర్యావరణ హితంగా స్టేషన్ పరిసరాలను తీర్చిదిద్దుతామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ముప్పై శాతానికి పైగా గ్రీన్ కవర్‌తో అమరావతి రాజధాని నిర్మాణానికి ఆయన నడుం బిగించారని గుర్తు చేశారు.

రేపటి నుంచి.. ఈఏపీ సెట్

- మూడు జిల్లాలో 22 కేంద్రాలు
- 19, 20 తేదీల్లో అగ్రికల్చరల్, ఫార్మసీ
- 21 నుంచి 27 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు

గుంటూరు(విద్య) మే 17 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ అగ్రికల్చరల్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వ హించే ఏపీఈఏపీ సెట్(ఆన్‌లైన్) పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆయా పరీక్షలు రాసే విద్యార్థుల కోసం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 22 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో బాపట్లలో రెండు, పల్నాడు జిల్లాలో ఐదు, గుంటూరు జిల్లాలో 15 కేంద్రాలు ఉన్నాయి. అగ్రికల్చరల్ ఫార్మసీ విభాగం విద్యార్థులకు 19, 22 తేదీల్లో, ఇంజనీరింగ్ విద్యార్థులకు 21 నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు ఉం టాయి. ఆన్‌లైన్ కేంద్రాల్లో ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఆయా పరీక్షలకు మొత్తం 41,319 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో ఇంజనీరింగ్ పరీక్షకు 34,148 మంది అగ్రికల్చరల్, ఫార్మసీ పరీ క్షకు 7106 మంది హాజరు కానున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కనీసం గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని కోఆర్డినేటర్లు తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అను మతించమని స్పష్టం చేశారు.

సోషల్ మీడియా.. సైబర్ నేరాలపై నిఘా

- దాతల సాయంతో ఎస్పీ కార్యాలయంలో పర్యవేక్షణ కేంద్రం

గుంటూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా.. సైబర్ నేరాలపై పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. ఎస్పీ కార్యాలయంలో పర్యవేక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా శనివారం ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ దాతలు జిల్లెళ్ళమూడి వెంకట్, కొల్లా అశోక్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని రూపాంతరం చెందుతున్న సైబర్ నేరగాళ్ల నేరాలకు అడ్డుకట్ట వేయడానికి సోషల్ మీడియా, సైబర్ క్రైమ్ పర్యవేక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ నిపుణులైన సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ సైబర్ నేరగాళ్ల కార్యకలాపాలను, అలాగే సామాజిక మాధ్యమాల ద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సంఘవిద్రోహ శక్తులను కనిపెట్టి వారి చర్యలను అణచివేసేలా ఎప్పటికప్పుడు ప్రణాళికలు రూపొందిస్తుంటారన్నారు. సామాజిక మాధ్యమాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారిని అప్రమత్తం చేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు జి.వి.రమణమూర్తి, ఏ.హనుమంతు, సీఐలు అశహరి శ్రీనివాస్, నిస్సార్‌బాషా, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ, ఎస్పీ సీసీ ఆదిశేషు, తదితరులు పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దాతలు వెంకట్, అశోక్, ఎస్పీ సతీష్‌కుమార్

సరస్వతి పుష్కరాలకు 24న ఆర్టీసీ స్పెషల్ బస్సు

గుంటూరు, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు, భక్తుల విజ్ఞప్తి మేరకు గుంటూరు నుండి సరస్వతి నదీ పుష్కరాలకు స్పెషల్ బస్సు ఈ నెల 24న ఏర్పాటు చేసినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ హైటెక్ బస్సు పుష్ బ్యాక్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తొలి రోజు బస్సు గుంటూరులో రాత్రి 10 గంటలకు బయలు దేరి.. రెండో రోజు ఉదయానికి కాళేశ్వరం చేరుతుందని తెలిపారు. అక్కడ పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం సాయంత్రం 4 గంటలకు బయలుదేరి.. రామప్ప దేవాలయ దర్శనం, అనంతరం వరంగల్‌లో భద్రకాళి మాత గుడి, వెయ్యి స్తంభాల గుడిని దర్శించి, మూడో రోజు ఉదయాన్నే కొండగట్టు చేరుతుందని తెలిపారు. అక్కడి నుంచి వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న తర్వాత రాత్రి గుంటూరు చేరుతుందన్నారు. ఇతర వివరాలకు 73828 97459, 73828 96403 సంప్రదించాలని కోరారు.

త్రికోటేశ్వరుని సన్నిధిలో జీవీ దంపతులు


ప్రత్యేక పూజలు చేస్తున్న జీవీ ఆంజనేయులు దంపతులు

వినుకొండ, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్ర మైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు శనివారం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి మూలవి రాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రజల శ్రేయస్సు కోరుతూ ప్రత్యేక ప్రార్థన లు చేశారు. ఆలయ అధికారులు వారికి స్వామివారి తీర్థప్రసా దాలు అందజేశా రు. జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం


జడ్పీ కార్యాలయంలో శుభ్రం చేస్తున్న సీఈవో జ్యోతి బసు

గుంటూరు సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంతో పాటు ఆనంద ఉంటుందని జడ్పీ సీఈఓ జ్యోతిబసు పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్ర మాన్ని జిల్లా పరిషత్ ఆవరణలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలను ఏ విధంగా పరిశుభ్రంగా ఉంచుకుంటారో.. కార్యాల యాలను కూడా అదేవిధంగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యాలయ ఆవరణలో చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. అకౌంట్స్ ఆఫీసర్ పి.శామ్యూల్ పాల్, సూపరింటెండెంట్లు మల్లేశ్వరరావు, పూర్ణ చంద్రా రెడ్డి, తోట ఉషాదేవి పాల్గొన్నారు.

క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన పార్టీ జనసేన


సభ్యత్వ కిట్లు పంపిణీ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, కొర్రపాటి నాగేశ్వరరావు

గుంటూరు సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన పార్టీ జనసేన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని లాల్ పురంలో జరిగిన జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కార్యకర్తల త్యాగాలు వల్లే పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రత్తిపాడు పార్టీ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో ఆటుపోట్లు ఎదురైనప్పటికీ ముందుకు నడచిన జన సైనికులకు కృతజ్ఞతలు తెలిపారు. నగర ఉపాధ్యక్షుడు చింత రేణుకరాజు, జిల్లా కార్యదర్శి కాటూరి శ్రీనివాసరావు మాస్టారు, మండల ప్రెసిడెంట్లు ఆముదాలపల్లి నరేంద్ర, గడ్డం శ్రీనివాసరావు, ప్రతి బావనారాయణ ,నియోజకవర్గ నాయకులు నాగినేని సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


షేక్ కొలిమి బడే సాహెబ్(ఫైల్)

నకరికల్లు, మే 17 (ఆంధ్రజ్యోతి): గుండ్లపల్లి ఇటుకల బట్టి సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఎక్సెల్‌పై వస్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. గుండ్లపల్లి గ్రామా నికి చెందిన షేక్ కొలిమి బడే సాహెబ్(69) తన పొలం పనులకు ద్విచక్ర వాహ నంపై బయలు దేరాడు. ఇటుకల బట్టి సమీపాన రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. నరసరావుపేట వైద్యశాలలో చికిత్స పొందుతూ సాహెబ్ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

డ్రోన్ టెక్నాలజీపై అవగాహన

పెదకాకాని, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల యం పాత్రికేయ విద్యా విభాగం ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ ఇన్ డ్రోన్ టెక్నా లజీ డిప్లమో విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై శని వారం అవగాహన కల్పిం చారు. పాత్రికేయ విద్యా విభాగాధిపతి ఆచార్య కె.జ్యోతిర్మయి మాట్లా డుతూ.. మేఘాలయ ప్రభుత్వ ప్లానింగ్ డిపార్ట్ మెంట్ సలహాదారుడు, వర్సిటీ పూర్వ విద్యార్థి వై.కిషోర్ మెళకువలు నేర్పించారని తెలిపారు. డీజీసీఏ నిబంధనలు, యూఏవీ అప్లికేషన్స్, రిమోట్ సెన్సింగ్, గూగుల్ ఎర్త్ ఇంజన్‌లను వివరిం చారు. సీనియర్ ఫొటో గ్రాఫర్, అధ్యాపకులు డాక్టర్ సీహెచ్ విజయ భాస్కర్‌ను అభినందించి, కృతజ్ఞతలు తెలిపారు.

నూతన క్రీడాపాలసీ క్రీడాకారులకు వరం

● కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్ ● నూతన కార్యవర్గం ఎన్నిక


ఏకగ్రీవంగా ఎన్నికైన కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

విజయవాడ(స్పోర్ట్స్), మే 17 (ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన నూతన క్రీడా పాలసీ వర్ధమాన క్రీడాకారులకు ఒక వరం అని ఏపీ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక విజయవాడ క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ కార్యదర్శి శ్రీకాంత్ మట్లాడుతూ నూతన అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎన్నికైందని, ఈ అసోసియేషన్ ఎకేఎఫ్ఐ గైడ్ లైన్స్ అనుగుణంగా పనిచేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించిన విధంగా కబడ్డీ క్రీడను మరింత అభివృద్ధి చేస్తామని, కూటమి ప్రభుత్వం లో క్రీడల్లో రాజకీయాలు ఉండవని అన్నారు. తమ అసోసియేషన్‌కు ఎకేఎఫ్ఐ గుర్తింపు, సహకారం అందిస్తుందని, రాష్ట్రంలో నిబంధనల ప్రకారం మా అసోసియేషన్‌కి మాత్రమే గుర్తింపు, అర్హత ఉన్నాయని అన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా చేస్తామని, ఖేలో ఇండియాలో మెడల్ కొట్టిన ప్రతి క్రీడాకారుడికి 5 వేలు బహుమతి అందిచడం జరిగిందని తెలిపారు. గతంలో కొంతమంది కబడ్డీ క్రీడా అసోసియేషన్ పేరుతో వివాదాలు చేశారని, ఇకపై అటువంటి వాటికి ఈ ప్రభుత్వంలో చోటులేదని, త్వరలోనే బీచ్ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కబడ్డీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడు మణికంఠకు మూడు లక్షల రూపాయలు చెక్‌ను అందజేశారు. కార్యవర్గం ఎన్నికకు ఎకేఎఫ్ఐ అబ్జర్వర్ గా వీరేష్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అసోసియేషన్ అధ్యక్షురాలిగా ప్రభావతి, వైస్ ప్రెసిడెంట్‌గా కృష్ణ, కార్యదర్శిగా యలమంచిలి శ్రీకాంత్‌లు ఎన్నికకగా, 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులను ప్రకటించారు.

ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (విద్య) మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐటీఐ కళాశాలల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సహాయ సంచాలకులు వీఎస్ఎస్‌వీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ మెన్ సివిల్, మెకానికల్ తదితర ట్రేడుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు పదవ తరగతి మార్కుల జాబితా, ఆధార్, తల్లిదండ్రుల ఆధార్, మొబైల్ నంబర్, ఈమెయిల్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో లతో ఈ నెల 25లోగా దరఖా స్తు చేసుకోవాలని తెలిపారు. గుంటూరు నగరంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఐటీఐ కళాశాలలో మొత్తం నాలుగు ట్రేడ్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు 0863-2234720, 83339 73927 ంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

ప్రారంభమైన పీజీ 4వ సెమిస్టర్ మూల్యాంకనం

పెదకాకాని, మే 17(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విద్యాలయంలో పీజీ నాలుగవ సెమిస్టర్ పరీక్ష పత్రాల మూల్యాంకనం శనివారం నుంచి ప్రారంభమైందని పీజీ పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు తెలిపారు. మూల్యాంకనానికి సీటీపీగా ఏఎన్‌యూ పాత్రికేయ విద్యా విభాగాధిపతి ఆచార్య కె.జ్యోతిర్మయి బాధ్యత వహించనున్నారు. ఆమె మాట్లాడుతూ వర్సిటీలోని ఆర్ట్స్, సైన్స్, ఎల్ఎల్‌బీ, ఎంబీఏ, ఫార్మసీ కోర్సుల్లోని అధ్యాపకులు మూల్యాంకనంలో భాగస్వామ్యం అవ్వాలన్నారు. ఆయా విభాగాల పాఠ్య ప్రణాళికా మండలి అధ్యక్షు లు ఎగ్జామినర్లను ఎంపిక చేసి, మూల్యాంక నంలో తమ వంతు సహాయ సహకారాలను అందించాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

గుంటూరు నగర పాలక సంస్థ

ఆర్.ఓ.సి.నెం.876106/2025/A2-2 ది.16-05-2025.

టెండరు కం బహిరంగ వేలము నోటీసు

గుంటూరు నగరపాలకసంస్థకు చెందిన ఆర్.టి.సి.బస్ స్టాండు ఎదురుగా గల డా.కొల్లి శారద హోల్ సేల్ కూరగాయల మార్కెట్టులో రుసుము వసూలు చేసుకొనే హక్కుకు వాటికి 2025-26 సం. నకు ది.01-06-2025 నుండి31-03-2026వరకు లీజు నిర్వర్తించుకొనుటకు టెండరు కం బహిరంగ వేలం ది.26-05-2025న ఉదయం గం॥ 11.00 ల నుండి 11.30 ల వరకు మునిసిపల్ ట్రావెలర్స్ బంగ్లా నందు సీల్డు టెండర్లు స్వీకరించబడును మరియు అదే రోజు గం.11.30 ల నుండి బహిరంగ వేలం నిర్వహించబడును. బహిరంగవేలం పూర్తయిన తదుపరి కమీషనరు గారిచే గాని వారిచే నియమించబడిన అధికారిచే గాని సీల్డు టెండర్లు తెరువబడును.

వరుస సంఖ్య	ఐటెం నెం.	అయిటములు	ధరావత్తు మొత్తము	సాల్వెన్సీ/ సెక్యూరిటీ డిపాజిట్టు (రూ)	కౌలు కాలము
1	1	ఆర్‌టిసి బస్ స్టాండు ఎదురుగా గల డా.కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్టులో రుసుము వసూలు చేసుకొనే హక్కు	రూ.5,00,000/-	రూ.10,00,000/-	01-06-2025 నుండి 31-03-2026 వరకు

గమనిక:-

1. లీజుదారుడు / గుత్తదారుడు వేలం మొత్తంపై అమలులో ఉన్న జి.యస్.టి. 18% ట్యాక్సును తప్పని సరిగా చెల్లించవలెను.
2. హెచ్చు పాట దారుడు / ఖరారు చేయబడిన పాట దారుడు తన యొక్క గాని, కంపెనీ లేఖ ఫారము యొక్క గాని, ఆర్థికపరిస్థితి తెలియజేయు పాట పాడిన మొత్తములో 25 శాతము బ్యాంకు గ్యారంటీ ఏదేని షెడ్యూలు బ్యాంకు నుండి పొంది సకాలంలో ఆఫీసునకు సమర్పించవలెను.
3. అసాధారణ రాజ పత్రము నెం.04, ది.07-02-2025 నియమ నిబంధనల ప్రకారము ఆక్షన్ జరుగును లీజుకు సంబంధించిన షెడ్యూలు ఖరీదు రూ.100/- ది.24-05-2025 సాయంత్రం గం.5-00 లోపు నగరపాలక సంస్థ యొక్క ట్రెజరీ నందు విధిగా చెల్లించి అటుల చెల్లించిన రశీదుతో సాయంత్రము గం 5.30 లోపు ఎ2-2 సీటు నందు షెడ్యూలు తీసుకొనవలెను.

టెండరు ధరావత్తు సొమ్ము ఏదైనా జాతీయ బ్యాంకు నందు కమీషనరు నగరపాలకసంస్థ, గుంటూరు వారి పేరున తప్పనిసరిగా ఒరిజనల్ డిమాండు డ్రాఫ్ట్ తీసుకొని టెండరు షెడ్యూలునకు జతపరచి దాఖలు చేయవలెను ఎట్టి పరిస్థితులలో చెక్కులు స్వీకరించబడవు. సాల్వెన్సీ మరియు ఇ.సి. టెండరుకు ఒరిజినల్ తో పాటు రిజిస్టర్ దస్తావేజు కాపీ, నోటరీ అఫిడవిట్ (under taking) తో సహా 3 రోజుల ముందు దాఖలు చేయవలెను. వేలమునకు సంబంధించి పాటలో పాల్గొనుటకు గాను MRO గారిచే జారీ చేయబడిన సాల్వెన్సీ సర్టిఫికేట్ ప్రాపర్టీ వాల్యుయేషన్ సర్టిఫికేట్ గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో మాత్రమే ఉండవలెను. బహిరంగ వేలములో కూడా ఒరిజనల్ డిమాండు డ్రాఫ్టు, ఒరిజనల్ సాల్వెన్సీ మరియు ఒరిజనల్ ఇ.సి. జతపరచవలెను. గజిట్ నోటిఫికేషన్ కాపీ మునిసిపల్ కార్యాలయము నందు రూ.250/-లు చెల్లించి పొందవలెను.

సదరు లీజులకు దాఖలు చేయబడిన టెండర్లలో హెచ్చు టెండరు గాని లేక బహిరంగ వేలములో హెచ్చు పాటను ఏది ఎక్కువైతే ఆమొత్తము ఆమోదించబడును సదరు టెండరు గాని లేదా వేలమును గాని అంగికరించుటకు మరియు తిరస్కరించుటకు కమీషనరు గారికి అధికారము కలదు. సదరు లీజులు యొక్క టెండరు కం బహిరంగ వేలముపై పునరాలోచనకు గానీ, వాయిదా వేయుటకు గాని నగరపాలకసంస్థ కమీషనరు గారికి పూర్తి అధికారములు కలవు.

ఇతర వివరముల కొరకు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగము నందు కార్యాలయపు పనివేళల యందు ఎ2-2 గుమస్తా గారిని సంప్రదించవలెను.

సం/- కమీషనరు, నగర పాలక సంస్థ, గుంటూరు

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

20 ఏళ్ల వరకు తాగునీటి సమస్య లేకుండా చేస్తాం

● అమృత్ 2.0లో నగరానికి రూ.362.24 కోట్లు మంజూరు
● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్, పక్కన మేయర్, కమిషనర్, ఎమ్మెల్యేలు

గుంటూరు కార్పొరేషన్, మే 17 (ఆంధ్రజ్యోతి) : నగరానికి రాబోవు 20 ఏళ్ల వరకు తాగునీటి సమస్య రాకుండా ప్రణాళికాబద్ధమైన ప్రాజెక్టును పూర్తి చేస్తామని, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. నగర పాలక సంస్థ సమావేశం మందిరంలో అమృత్ 2.0లో నగరానికి మంజూరైన 362.23 కోట్ల నిధులు గురించి వివరించి, శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణానికి సహకరించిన భవన యజమానులకు శనివారం చెక్కులను మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు బి.రామాంజనేయులు, మహమద్ నసీర్‌తో కలిసి అందించారు.

కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ నగరాన్ని తాగునీటి సరఫరా అవసరాల ప్రాతిపదికన మూడు ప్రాంతాలుగా గుర్తించడం జరిగిందన్నారు. ఆయా ప్రాంతాలకు నీరు అందించడానికి కూటమి ప్రభుత్వం రూ.362.23 కోట్ల నిధులను మంజూరు చేసిందని తెలిపారు. గోరంట్ల పైప్ లైన్ ఏర్పాటుకు అమృ త్ 2.0 నుంచి రూ.331.10 కోట్లు, అలాగే అమృత్ పాయింట్ల కింద ఉన్న లేఔట్ల కు వాటర్ సప్లై నిమిత్తం రూ.32.13 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయిం చిందన్నారు. విలీన గ్రామాల్లో తాగునీటి సరఫరాకు రూ.258 కోట్లు త్వరలో మంజూరు అవ్వబోతున్నాయన్నారు. ప్రస్తుత జనాభాకే కాకుండా రానున్న 20 ఏళ్ల కాలంలో పెరిగే జనాభా అవసరాలను అంచనా వేసి అమృత్ 2.0 ప్రాజెక్ట్‌ని నగరంలో అమలు చేస్తామన్నారు. కృష్ణా నది నుంచి నీటిని అమృత్ 2.0 పథకం ద్వారా నేరుగా గోరంట్ల ఏరియాకు సరఫరా తీసుకుంటున్నామని, కృష్ణా నది దగ్గర నుంచి ఒక పంపింగ్ మెకానిజంతో పాటు గోరంట్ల వద్ద కూడా మరో మెకానిజం ఉంటుందన్నారు. త్వరలోనే యూజీడీ సమస్యకు కూడా తగిన పరిష్కార మార్గాలను చేపడతామన్నారు. అలాగే త్వరలో శంకర్ విలాస్ ఆర్వోబీ పనులు ప్రారంభం జరుగుతుందన్నారు.

మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ కృష్ణానది కరకట్ట మంతెన ఆశ్రమం దగ్గర నుంచి కంతేరు మీదుగా గోరంట్లకు తాగునీటిని తెచ్చేందుకు ప్రాజెక్ట్ మంజూరు ద్వారా నగరానికి గతంలోని సోర్స్‌తో పాటు మొత్తం 3 ప్రాంతాల నుండి నీటిని తీసుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ అన్ని ప్రాంతాలకు తాగునీరు అందాలన్న గుంటూరు నగర వాసుల 40 ఏళ్ల కల తీరబోతుండడం ఆనందంగా ఉందన్నారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి సరఫరా అత్యంత కీలకమని, రాబోవు కాలంలో సమస్య రాకుండా ముందస్తుగా పక్కా ప్రణాళికతో అమృత్ 2.0 ప్రాజెక్ట్ ద్వారా కృష్ణా నది నుంచి నీటిని తీసుకురావడానికి అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం అందించిందన్నారు.

ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను గెలిచినా ఏడాదిలోనే అమ లు చేస్తున్నారన్నారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి ఇంటికి తాగునీటిని అందిస్తామన్న చంద్రబాబు నాయుడు, తమ హామీ మేరకు ఆచరణలో ప్రాజెక్టలను మంజూరు చేశారన్నారు. రానున్న కాలంలో మహా నగ రంగా గుంటూరు అభివృద్ధి చెందుతుందని, అందుకు తగిన నీటి అవసరాలను తీర్చేలా అమృత్ ప్రాజెక్ట్ దోహదపడుతుందన్నారు. అనంతరం శంకర్ విలాస్ ఆర్వోబీ ప్రభావిత భవన యజమానులు అంగీకారం తెలిపిన 23 మందికి రూ. 1.15 కోట్ల చెక్‌లను అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ డి.శ్రీనివాస్, సిటి ప్లానర్ రాంబా బు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రేపు నగరంలో పాక్షికంగా నీటి సరఫరా

గుంటూరుకార్పొరేషన్, మే 17(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ హెడ్ వాటర్ వర్క్సులో ఎయిర్ వాల్వ్‌పై ఏర్పడిన లీకు మరమ్మతు పనులు చేయడం వలన సోమవారం సాయంత్రం నగరంలో పాక్షికంగా నీటి సరఫరా జరుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూనగర్, శారదాకాలనీ, వసంతరాయపురం, హెచ్ఎల్ఆర్, ఐపీడీ కాలనీ, స్తంభాలగరువు, గుజ్జనగుండ్ల, విద్యానగర్, హనుమయ్యనగర్, ఏటీ అగ్రహారం, రెడ్డిపాలెం, గోరంట్ల, అడవి తక్కెళ్లపాడు, రాజీవ్ గాంధీ నగర్, కోర్ట్ కాంపౌండ్, మిర్చి యార్డ్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, శ్యామల నగర్ రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాల్లో పాక్షికంగా నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

గుంటూరు మెడికల్, మే 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పెదకాకాని మండలం అగతవరప్పాడులోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కేరళ ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ ఉచిత వైద్యశిబిరంలో కీళ్లనొప్పులు, డిస్క్ సమస్యలు, పక్షవాతం, మోకాళ్ల నొప్పులు, ఆస్మా, ఎలర్జీలు, అధిక బరువు, చర్మవ్యాధులు, వెన్నుపూస సమస్యలు, హెచ్ఐవీ/ఎయిడ్స్ వంటి వ్యాధులకు, అనుభవం గల వైద్య బృందం రోగులకు నాడీ పరీక్షలు జరిపి ఉచితంగా మందులు ఇస్తారని ఆయన వివరించారు.



ఆశాలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

కిల్కారి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

గుంటూరు మెడికల్, మే 17 (ఆంధ్రజ్యోతి): గర్భిణీలు, బాలింతల ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం కిల్కారి సేవలు ప్రవేశ పెట్టిందని, దీనిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి తెలిపారు. ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆశా నోడల్ అధికారులతో కిల్కారి సేవలపై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భిణీ నాల్గవ నెల నుంచి బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకు వారానికి ఒకసారి కిల్కారి ఫోన్ కాల్స్ వస్తాయని ఆమె వివరించారు. రెండు నిమిషాలసేపు ఉండే ఈ వాయిస్ కాల్స్‌లో తల్లిబిడ్డల ఆరోగ్య సమాచారాన్ని తెలియజేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిల్కారి కాల్ నెంబర్ 01244451660 అని, ఈ నెంబర్‌ను గర్భిణీ సెల్‌ఫోన్‌లో నమోదు చేయాలని ఆమె సూచించారు. అనంతరం కిల్కారిలో చక్కగా పనిచేసిన ఆశాలకు బహుమతులను డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ అందజేశారు. కార్యక్రమంలో శ్రావణ్‌బాబు, రోహిణి రత్నశ్రీ, డీ శ్రీనివాస్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సున్నిత హాస్యంతో మానసిక వికాసం

గుంటూరు(తూర్పు), మే 17(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర సున్నిత హాస్యంతో మానసిక వికాసం కలుగుతుందని కిట్స్ ఛైర్మన్ కోయ సుబ్బారావు, డాక్టర్స్ స్మైల్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రామ్ కుమార్ అన్నారు. శనివారం భారతీయ విద్యా భవన్‌లో జరిగిన స్టాండప్ కామెడీ షో కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. నేడు అందరూ హాస్యం అంటే వ్యంగ్యం, బూతులుగా భావిస్తున్నారని... హాస్యరసం విలువ తెలియాలంటే పాత హాస్య సినిమాలు చూడాలని సూచించారు. భారతీయ విద్యా భవన్ కార్యదర్శి రామచంద్రరాజు మాట్లాడుతూ భవన్స్ కల్చరల్ అండ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కామెడీ షోలో తెలుగు రాష్ట్రాలకు చెందిన కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారని వివరించారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ జిల్లా కన్వీనర్ ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ, కళాపీఠం అధ్యక్షుడు విజయ్ కుమార్, భారతీయ విద్యా భవన్స్ ప్రధానోపాధ్యాయురాలు కృష్ణ ఉష్ణశ్రీ తదితరులు పాల్గొన్నారు.




స్టాండప్ కామెడీ షోలో పాల్గొన్న చిన్నారులను అభినందిస్తున్న రామచంద్ర రాజు, కోయ సుబ్బారావు తదితరులు

పెట్రోల్ బంకుల్లో నిబంధనలు పాటించాలి

● జాయింట్ కంట్రోలర్ ఎన్ఎస్ మాధురి

గుంటూరు(తూర్పు), మే 17(ఆంధ్రజ్యోతి) : పెట్రోల్ బంకుల్లో ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను విధిగా పాటించాలని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ ఎన్ఎస్ మాధురి అన్నారు. మెట్రాలజీ డే కార్యక్రమాల్లో భాగంగా శనివారం పలకలూరు రోడ్డులోని గుంటూరు క్లబ్‌లో పెట్రోలియం డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పెట్రోల్ నాణ్యతపై అనుమానం ఉంటే ఫిల్టర్ పేపర్ ద్వారా వినియోగదారులు పరిశీలించుకోవాలన్నారు. అమ్మకాలకు ముందు 5లీటర్ల కొనికల్ మెజర్‌తో నాజిల్‌ను తనిఖీ చేసుకుని, తేడా గమనించినట్లయితే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. బంక్ నిర్వాహకులు ఎలక్ట్రానిక్ పంపును క్రమం తప్పకుండా ప్రతి ఏడాది ధ్రువీకరించాలని స్పష్టం చేశారు. సమావేశంలో డిప్యూటీ కంట్రోలర్ షాలమ్‌రాజు, అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు సునీల్ రాజా, జాన్ సైదా, ఉమ్మడి జిల్లాల పెట్రోలియం అసోసియేషన్ డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాధురి, చిత్రంలో పెట్రోల్ బంక్ యాజమానులు

30 నుంచి గుంటూరు ఓపెన్ టెన్నిస్ పోటీలు

గుంటూరు(తూర్పు), మే 17(ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్ స్టేడియంలో ఈనెల 30 నుంచి మూడు రోజుల పాటు అండర్ 16, బాల, బాలికలు విభాగంలో గుంటూరు, ఓపెన్ టెన్నిస్ పోటీలు నిర్వహిస్తున్నట్టు టోర్నమెంట్ డైరెక్టర్ నాగేంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ ఎంట్రీలను ఈనెల 28లోపు బీఆర్ స్టేడియం టెన్నిస్ కోచ్ అహ్మద్‌కు పంపాలని కోరారు. పోటీలలో పాల్గొనే వారు విధిగా జనన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురావాలన్నారు. క్రీడాకారులకు అల్పాహారాన్ని, విజేతలకు నగదు బహుమతులను అందజేయనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 98483 27654, 94934 00111 అనే నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

ఆకట్టుకున్న పార్వతీ కల్యాణం సంగీత రూపకం



కీర్తనలను ఆలపిస్తున్న కృష్ణఆదిత్య, కృష్ణశశాంక్‌లు

గుంటూరు(తూర్పు), మే 17(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం జరిగిన పార్వతీ కల్యాణం సంగీత రూపకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ గాయకులు కంభంపాటి సోదరులు కృష్ణఆదిత్య, కృష్ణశశాంక్‌లు తమ గాత్రధారణలో పలు గీతాలను ఆలపించి ఆహూతులను రంజింపజేశారు.



ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేస్తున్న ఎన్‌టీఏ నాయకులు

ఉపాధ్యాయ బదిలీలలో ఏర్పడిన అనిశ్చితి తొలగించాలి

● ఎన్‌టీఏ నాయకుల విజ్ఞప్తి

గుంటూరు(విద్య), మే 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో నెలకొన్న అనిశ్చితిని తొలగించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వినితి పత్రం అందజేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల విషయంలో వెంటనే జోక్యం చేసుకొని ప్రతిష్టంభనను తొలగించాలని, సహేతుకమైన ఉపాధ్యాయుల డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వెంటనే బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు వీలైనంత త్వరగా విడుదల చేయడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖలీల్, గుంటూరు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సాయి విశ్వనాథ్, పి.లలిత బాబు, ఆర్థిక కార్యదర్శి కె.వి.రాఘవులు తదితరులు పాల్గొన్నారు

కెనరాబ్యాంక్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

గుంటూరు, మే 17(ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెనరా బ్యాంక్ రీజనల్ ఆఫీస్, జేకేసీ కళాశాల రోడ్డులో, గోరంట్ల శాఖలో మంచినీటి చలివేంద్రాలను ప్రారంభించారు. ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రవికుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం మండు వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. వేసవి కాలం వరకు చలివేంద్రం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ డి.రాజ్‌కుమార్ ప్రజలకు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన అసోసియేషన్ నాయకులు

ఎస్టీయూ నాయకుల ఆర్థిక చేయూత

గుంటూరు (విద్య), మే 17 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యలకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న డీఈవో కార్యాలయం ఉద్యోగినికి ఎస్టీయూ నాయకులు ఆర్థిక చేయుత అందించారు. ఈ మేరకు డీఈవో కార్యాల యంలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగి ఎస్.రత్నమాలకు రూ.67 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు, డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20న జరిగే ఆందోళనలను జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), మే 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేఖ విధానాలపై ఈ నెల 20న జరిగే ఆందోళనలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ పిలుపు నిచ్చారు. స్థానిక బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొగాకు, మిర్చి రైతులను నిర్లక్ష్యం చేసిన పాలకులకు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. భూ యజమానితో సంబంధం లేకుండా కొత్త చట్టాన్ని తీసుకొచ్చి గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు ఇవ్వాలన్నారు. సమస్యలపై జరిగే ఆందోళనల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో పాశం రామారావు, ఈమని అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంచుమాటి అజయ్‌కుమార్, పాల్గొన్న పాశం రామారావు తదితరులు

నేడు పట్టణంలో తిరంగా యాత్ర

మంగళగిరి, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆప రేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యం లో భారత సైనిక దళాలకు సంఘీభావంగా మంగళగిరి పట్టణంలో ఆదివారం తిరంగా యాత్ర నిర్వహిస్తున్నట్టు కూటమి నేతలు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం నుంచి మెయిన్ బజారు మీదుగా పాత కూరగాయల మార్కెట్ వద్ద గల గాంధీ విగ్రహం వరకు జాతీయ పతాకాలతో తిరంగా యాత్ర జరుగుతుందన్నారు.

సెలవులో ఎస్పీ సతీష్ కుమార్

● ఇన్‌చార్జిగా బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ

గుంటూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ వారం రోజుల సెలవు పెట్టారు. కుటుంబంతో తమిళనాడు రాష్ట్రంలోని ఈ రోడ్ సమీపంలోని ఆయన స్వగ్రామానికి వెళ్లారు. ఇన్‌చార్జిగా బాపట్ల ఎస్పీ తుషార్ డూడీని నియమించారు. సతీష్ కుమార్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టి 10 నెలల కాలంలో తొలిసారిగా వారం సెలవు పెట్టారు. ఈ నెల 25న గుంటూరు రానున్నారు. 26న విధుల్లో చేరనున్నట్లు తెలిసింది.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

గుంటూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నగరాలులో సీతారాం నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనికళ్ల లక్ష్మణ్ రెడ్డి (26) ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. సీతారాం నగర్ చెందిన రామకృష్ణారెడ్డి కుటుంబం లక్ష్మీ నందన అపార్ట్మెంట్‌లో నివాసం ఉంటోంది. కూతురికి వివాహం కాగా కొడుకు లక్ష్మణ్ రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా వర్క్ ఫ్రం హోం పనిచేస్తున్నాడు. లక్ష్మణ్‌రెడ్డి తల్లిదండ్రులు రెండు రోజుల క్రితం తిరుపతి వెళ్లారు. శుక్రవారం సాయంత్రం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటికి వచ్చి చూడగా బెడ్రూంలో లక్ష్మణ్ రెడ్డి ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. అప్పటికే అతను మృతి చెందాడు. లక్ష్మణ్ రెడ్డికి పెళ్లి చేయాలని తల్లిదండ్రులు నిర్ణయించారు. ఇటీవల రెండు మూడు సంబంధాలు రాగా నచ్చలేదని చెప్పాడు. ఈ నేపథ్యంలో ఎటువంటి కారణాలు లేకుండానే లక్ష్మణ్ రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య గురించి మాట్లాడొద్దన్నందుకు దాడి

గుంటూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : భార్య గురించి అసభ్యంగా మాట్లాడొద్దని హెచ్చరించినందుకు భర్తపై ముగ్గురు యువకులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని శనివారం చోటుచేసుకుంది. కృష్ణబాబు కాలనీకి చెందిన మాన్యం గోపీ కూలి పనులు చేస్తుంటాడు. ఈ నెల 16న అదే ప్రాంతాన్ని చెందిన సుభాని, సురేష్, శ్రీనివాస్ అనే ముగ్గురు గోపీ వద్దకు వచ్చి ఆయన భార్య పట్ల తప్పుగా మాట్లాడారు. దీంతో గోపి వారిని హెచ్చరించాడు. అదేరోజు రాత్రి చిల్లర కొట్టు వద్ద ఉన్న గోపీపై ఇనుపరాడ్డుతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లు ఖాళీ చేయకుంటే..పేర్లు రాసి చచ్చిపోతా

గుంటూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఇల్లు ఖాళీ చేయకుంటే మీ అందరి పేర్లు రాసి చచ్చిపోతానంటూ బెదింపులకు పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. బ్రాడీపేట 5/7వ లైనుకి చెందిన నీలి శివ ప్రసాద్‌కు బ్రాడీపేటలో భవనం ఉంది. అందులోని పై అంతస్తులో దమ్మాలపాటి రవి అనే అతను ఏడేళ్లుగా అదెకు ఉంటున్నాడు. కొన్నాళ్ల క్రితం అదే బిల్డింగ్‌లో కింది అంతస్తులోని పోర్షన్ తాళాలు పగలగొట్టి ఆక్రమించుకోగా దమ్మాలపాటి రవిని పోలీసులు అరెస్ట్ చేశారు. రిమాండ్ నిమిత్తం జైలుకెళ్లి... ఈ నెల 14న రవి తిరిగి శివప్రసాద్‌కు చెందిన బిల్డింగ్‌లోకి అక్రమంగా ప్రవేశించాడు. శివప్రసాద్‌తో పాటు, అద్దెకు ఉండే వారితో గొడవ పెట్టుకొని, అసభ్యంగా తిట్టి గాజుతో కోసుకుంటానని, ఇల్లు ఖాళీ చేయమని బెదిరిస్తూ సైకో లాగా ప్రవర్తించాడు. అందరి పేర్లు రాసి చనిపోతానంటూ బెదిరించాడు. బాధితుడు శివప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసున్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చండి : జంగాల

గుంటూరు(తూర్పు), మే 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని సీ పీ ఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణాల్లో రెండు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి రూ.4 లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీపై కార్యచరణ ప్రకటించాలని కోరారు. సూపర్ సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. సమస్యలపై 19న అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోటా మాల్యాద్రి, ఆకిటి అరుణ్ కుమార్, పచ్చల శివాజీ, పి.వి జగన్నాథం, బి.వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్, పాల్గొన్న సీపీఐ నాయకులు

జగన్ అక్రమాలపై కేంద్రం దూకుడు పెంచాలి : డొక్కా

తుళ్లూరు, (వెంకటపాలెం)మే17 (ఆంధ్రజ్యోతి): జగన్ అక్ర మాలపై కేంద్ర ప్రభుత్వం దూకుడు పెంచాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం వెంకటపాలెం వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పేద ప్రజలకు పిచ్చి మందు అమ్మి.. ప్రాణాలు బలిగొన్నారన్నారని విమర్శించారు. కిడ్నీలు, లివర్ పాడయ్యే కల్తీ మద్యాన్ని వైసీపీ ప్రభుత్వంలో విక్రయించారని ఆరోపించారు. మద్యం కుంభకోణంపై సిట్ దర్యాప్తు బాగానే జరుగుతుందన్నారు. ఇంకా వేగవంతం చేసి, రూ.లక్ష కోట్లు రికవరీ చేసి.. పిచ్చి మందు తాగి అనారోగ్యం పాలైన వారికి ఆ డబ్బుని సాయం కింద అందజేయాలని డొక్కా డిమాండ్ చేశారు. బిగ్ బాస్ దగ్గర రూ.లక్ష కోట్లున్నాయా.. అని విలేకరులు ప్రశ్నించగా.. ఎన్ని రూ.లక్ష కోట్లున్నాయో తెలియదన్నారు. తనకు తెలిసి రెండు మూడు రూ.లక్షల కోట్లు ఉంటాయని డొక్కా పేర్కొన్నారు.

శ్మశాన వాటికలను మౌలిక వసతులతో అభివృద్ధి చేస్తాం

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, మే 17 (ఆంధ్రజ్యోతి): మహాప్రస్థాన సేవా సమితి స్ఫూర్తితో గుంటూరు నగరంలోని శ్మశాన వాటికలను మౌలిక వసతులతో అభివృద్ధి చేస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. బొంగరాల బీడులోని నగర పాలక సంస్థ హిందూ శ్మశాన వాటికలో నూతనంగా నిర్మించిన గ్యాస్ ఆధారిత దహనవాటికను, ఫ్రీజర్ రూమ్‌ను శనివారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, మహాప్రస్థానం సేవా సమితి సభ్యులతో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ రవీంద్ర మాట్లాడుతూ, మహాప్రస్థాన సేవా సమితి రాష్ట్రంలోనే తొలిసారి స్తంభాలగరువు శ్మశాన వాటికలో ఆధునిక వసతులతో ఆహ్లాదకరంగా అభివృద్ధి చేశారని, అదే స్ఫూర్తితో నగర పాలక సంస్థ నిధులు, దాతల సహకారంతో బొంగరాలబీడు శ్మశాన వాటికలో కూడా ఆధునిక వసతులు కల్పించారన్నారు.

కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ, గుంటూరు నగరంలో దశల వారీగా అన్ని శ్మశానాలను అభివృద్ధి చేస్తామన్నారు. బొంగరాలబీడులో నగర పాలక సంస్థ నుంచి రూ.99.50 లక్షలు 14 ఆర్థిక సంఘం నిధులు,సేవా సమితి దాతల ద్వారాసేకరించిన నిధులతో రాజమండ్రి తరువాత గుంటూరులోనే గ్యాస్ ఆధారిత దహనవాటికను ఆధునిక వసతులతో ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఈఈ సుందరరామిరెడ్డి, మహాప్రస్థానసేవా సమితి సభ్యులు వై.లక్ష్మణరావు, వై.అంకమ్మ చౌదరి, ఎల్.విజయసారథి, కె.రమణయ్య, వై.నాగేశ్వరరావు, కే.మాలకొండయ్య, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గ్యాస్ ఆధారిత దహన వాటికను ప్రారంభిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు

వేడి వాతావరణాన్ని తగ్గించుకోవచ్చు : మేయర్

గుంటూరు కార్పొరేషన్, మే 17(ఆంధ్రజ్యోతి): పర్యావరణ కాలుష్యాన్ని అడ్డుకోవడం ద్వారా ఏర్పడే వేడి వాతావరణాన్ని తగ్గించుకోవచ్చని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం బొంగారాలబీడు హిందూ శ్మశాన వాటిక దగ్గర ఐ.టి.సి ఫినిష్ సంస్థ సౌజన్యంతో మెట్టు అంజిరెడ్డి అందించిన గుడ్డ సంచులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఆయన ప్రజలకు అందించారు. మేయర్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారుతున్న ప్లాస్టిక్ వినియోగం మాని వాటి స్థానంలో గుడ్డ సంచులు, జూట్ వంటి ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించుకోవాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం ప్రజారోగ్యానికే కాక పర్యావరణానికి కూడా ప్రమాదకరంగా మారుతుందని, ప్రజలు ప్లాస్టిక్ వినియోగం నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, ఐటీసీ ఫినిష్ సంస్థ నుంచి నారాయణ, పర్యావరణ విద్య నోడల్ ఆఫీసర్ తిరుపతిరెడ్డి, నగర పాలక సంస్థ విభాగాధిపతులు పాల్గొన్నారు.

అనధికారికంగా మాంసం విక్రయిస్తే చర్యలు : కమిషనర్

నగరంలోని రోడ్లపై అనధికారికంగా నాటు కోళ్లు, చేపలు, మాంసం విక్రయాలు చేయడానికి వీలులేదని, డివిజన్ల వారీగా అనధికార విక్రయాలు జరగకుండా ప్రజారోగ్య అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ అనధికార విక్రయాలు చేసే వారికి భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించటమే కాకుండా చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. మాంస విక్రయదారులు తప్పనిసరిగా డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ పొంది వ్యాపారం నిర్వహించుకోవాలని, లైసెన్స్ లేని షాపులను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు.

జనసేన కార్యకర్తకు రూ.5 లక్షల బీమా అమలు

● బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ వెల్లడి

గుంటూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ దేశంలో ఏ రాజకీయ పార్టీ కూడా చేయని విధంగా కార్యకర్తల సంక్షేమానికి రూ.5 లక్షల బీమా అమలు చేస్తున్నట్లు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం అమరావతి రోడ్‌లోని జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో కార్యకర్తలకు పార్టీ సభ్యత్వ నమోదుకు సంబంధించిన కిట్లను ఆయన పంపిణీ చేశారు. సభ్యత్వ నమోదుతోనే ప్రతి కార్యకర్తలో భరోసా నింపే విధంగా ఉందని బోనబోయిన తెలిపారు. జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం రూపొందించిన విధానం చూస్తేనే పవన్ కల్యాణ్ కు పార్టీ కేడర్‌పై ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. అనంతరం వలంటీర్లకు సభ్యత్వ నమోదు కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్లలో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా క్రియాశీలక కార్యకర్తలకు పంపిన లెటర్ సందేశాన్ని బోనబోయిన చదివి వినిపించారు. కార్యక్రమంలో పార్టీ నగర కమిటీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు పత్రాలతో బోనబోయిన, గాదె

కవిత స్రవంతి ఆవిష్కరణ

గుంటూరు(తూర్పు), మే 17(ఆంధ్రజ్యోతి): అభ్యుదయ రచయితల సంఘం, తొంబై ఏళ్ల ప్రయాణానికి సూచికగా ప్రముఖ రచయితలు రచించిన కథా స్రవంతి, కవిత స్రవంతుల ఆవిష్కరణ కార్యక్రమం శనివారం స్థానిక బృందావన్‌గార్డెన్స్, సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ హాజరై నాలుగు కవితా స్రవంతి పుస్తకాలను ఆవిష్కరించారు. సభకు సాహితీవేత్త భూసూరపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా, సభను వల్లూరి శివప్రసాదు నిర్వహించారు. ఈ సందర్భంగా పాపినేని శివశంకర్ మాట్లాడుతూ ఈ పుస్తకాలు చదవడం నేటి తరానికి అవసరమని అన్నారు. పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఛాయ్‌రాజ్, ఎండ్లూరి సుధాకర్, నూతలపాటి గంగధర్‌ల కవిత్వాన్ని ఈ తరానికి సులభతరం చేసి అందజేస్తున్న అరసం సేవలను అభినందిస్తున్నట్టు పేర్కొన్నారు. భూసూరపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ పుస్తకాలు కవి ఆత్మీయతను ప్రతిబించేలా ఉన్నాయని అన్నారు. మందరపు హైమావతి, ఎండ్లూరి మానస, దివికుమార్‌లు మాట్లాడుతూ తాము రాసిన కవితలకు నేటి తరానికి మార్గదర్శకత్వం అవుతుందని చెప్పారు. అనంతరం యుద్ధం-శాంతి శీర్షికపై జరిగిన కవి సమ్మేళనం ఆసక్తికరంగా జరిగింది. కవి సమ్మేళనంలో బండికల్లు జమదగ్ని, మేడిశెట్టి సుభద్ర, గండిపాటి హేమలత, ఎం.లలితకుమారి పాల్గొనగా, కార్యక్రమాన్ని అరసం కార్యదర్శి కోసూరి రవికుమార్ నిర్వహించారు.



కథా స్రవంతి, కవిత స్రవంతి పుస్తకాలను ఆవిష్కరిస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, పాపినేని శివశంకర్ తదితరులు

ప్రభుత్వాస్పత్రిని ఈ-హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేస్తాం

- నాట్కో కేన్సర్ విభాగానికి గ్రేడ్-1 సెంటర్‌గా గుర్తింపు
- త్వరలో రూ.10 కోట్లతో సర్వీస్ బ్లాక్ నిర్మాణ పనులు
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి

గుంటూరు మెడికల్, మే 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రిని ఈ-హాస్పిటల్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి,కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. మెడికల్ రికార్డుల ఎలక్ట్రానిక్ డాక్యుమెంటేషన్ కోసం ఈ-ఆఫీస్‌కు అవసరమైన 300 కంప్యూటర్లను సాఫ్ట్ వేర్ కంపెనీల సహకారంతో అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. శనివారం గుంటూరు నాట్కో సెంటరు సెమినార్ హాలులో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని వైద్య సేవలపై రోగుల సంతృప్తి స్థాయిని మరింత మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనుపత్రిలో మధురాన్నం ట్రస్ట్ ద్వారా జరుగుతున్న అన్నదానం మినహా మిగిలిన వారు అన్నదానం చేయకుండా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. దాతలు దానికి బదులు వీల్ చైర్ వంటివి అందజేయాలని ఆయన సూచించారు. నాట్కో క్యాన్సర్ సెంటరులో 120 పడకలతో పాటు అదనంగా మరో 150 పడకలకు విస్తరిస్తున్నందున ప్రభుత్వం క్యాన్సర్ చికిత్స లెవల్ వన్ ఆసుపత్రిగా గుర్తించినట్లు డాక్టర్ పెమ్మసాని తెలిపారు. పెట్ స్కాన్‌ను ప్రారంభించనున్నందున దీనికి అవసరమైన సాంకేతిక సిబ్బందిని నియమించుకోవటానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

నర్సింగ్ కళాశాలకు బస్సు విరాళం

ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని నర్సింగ్ పాఠశాలకు రూ.35 లక్షల విలువైన బస్సును విరాళంగా ఇచ్చేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త, హెచ్‌డీఎస్ సభ్యుడు తులసీ రామచంద్రప్రభు సమావేశంలో ప్రకటించారు. అదేవిధంగా ఆసుపత్రి ఆవరణలో రూ.10 కోట్లతో చేపట్టే సర్వీస్ బ్లాక్ ఎంఓయు పత్రాలను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ తేజ, ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్, బూర్ల రామాంజనేయులతో కలసి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వికి.. రామచంద్ర ప్రభు అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని తదితరులు రామచంద్రప్రభును సత్కరించారు. అనంతరం డాక్టర్ యశస్వీ రమణ ప్రచురించిన జీజీహెచ్ సుఖీభవ సమాచార దర్శిని పుస్తకాన్ని మంత్రి, ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఎంవోయూను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కి అందజేస్తున్న తులసి రామచంద్రప్రభు

ప్రజలు, ప్రభుత్వ భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర సాధ్యం

● రోడ్లు ఊడ్చి, మురుగుతీసిన మంత్రి మనోహర్ ● మురుగు కాల్వల నిర్వహణపై ఆగ్రహం ● సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లాల్సిందే..

తెనాలి, మే 17, (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉంటే పట్టణంలోని పౌరులంతా ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తెనాలిలోని శివాజి చౌక్ వద్ద నుంచి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. మున్సిపల్ కార్యాలయం వరకు ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధుల్లోనూ పర్యటించారు. ఈ సందర్భంగా జనం తమ సమస్యలపై వినతిపత్రాలు అందించి, ఏకరవుపెట్టారు. ఓపికగా వృద్ధులు, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి మంత్రి సమాధానమిచ్చారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాల్లో నిర్వహిస్తామని, ప్రజలు సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సచివాలయ సిబ్బంది కూడా ఇకపై ఇంటింటికీ వెళ్లి.. ప్రజల సమస్యలు పరిష్కారంచేసేలా 'ఇంటింటికీ సచివాలయ సిబ్బంది' కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రజలకు మరింత చేరువ అవుతామని, నడవలేని వృద్ధులు, ప్రత్యేక అవసరాలవారికి ఆసరాగా నిలిచేలా ప్రణాళిక రూపొందించనున్నట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు. అనంతరం పూడిక సరిగా తీయకపోవడంతో రోడ్లపైకి నీరు చేరేలా ఉండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలో మొత్తం కాల్వల పూడిక తీయాలని మున్సిపల్ కమిషనర్ శేషన్నను ఆదేశించారు. వర్షం వచ్చినప్పుడు చుక్క నీరు కూడా రోడ్లపై నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. తడిచెత్త, పొడి చెత్త సేకరణ కార్యక్రమాన్ని దేశంలోనే తెనాలిలో ఎప్పుడో ప్రారంభించామని, ఇది దేశానికి మార్గదర్శకంగా నిలిచిందని మనోహర్ పేర్కొన్నారు.


మార్కెట్ సెంటర్‌లో చీపురుపట్టి చెత్త ఊడ్చుతున్న మంత్రి మనోహర్, సబ్‌కలెక్టర్ సంజనా సింహ తదితరులు

జగనన్న కాలనీల కాంట్రాక్టర్లపై కేసులు పెట్టండి

జగనన్న కాలనీ లబ్ధిదారులు తమ సమస్యలను మంత్రి మనోహర్ దృష్టికి తీసుకొచ్చారు. గుత్తేదారులు ఇంటి నిర్మాణానికి అదనంగా ఖర్చవుతుందంటూ రూ. 50 వేల నుంచి రూ. 3 లక్షల వరకు వసూలు చేశారని తెలిపారు. అయినా.. ఇంటిని నిర్మించక పోగా డబ్బు కూడా తిరిగి ఇవ్వడం లేదని, అప్పట్లో అడిగితే తమపైనే దౌర్జన్యం చేశారని వాపోయారు. దీంతో స్పందించిన మంత్రి పేదల సొమ్ము తీసుకున్న వారిని వదలమని, వారి దగ్గర నుంచి డబ్బు వసూలు చేసి బాధితులకు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. లబ్ధిదారులను మోసగించి డబ్బు వసూలు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డీఎస్పీ జనార్ధనరావును ఆదేశించారు. అంతా పేదలేనని, అప్పులు చేసి మరీ సొంతింటి కోసం అధిక వడ్డీలకు డబ్బు తెచ్చిస్తే వాటిని నొక్కేసి, ఇళ్లు కట్టకుండా పేదలను మోసం చేయడం దారుణమని, వారిని వదలడానికి వీల్లేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రితోపాటు తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, జిల్లా పొల్యూషన్ కంట్రోల్ అధికారి నజీమా బేగం, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.


జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మిస్తామంటూ తమ దగ్గర డబ్బు తీసుకుని ఇళ్లు కట్టకుండా వదిలేశారంటూ మంత్రికి ఫిర్యాదు చేస్తున్న మహిళలు

లోప 'భూ'యిష్టం

● అన్నదాత సుఖీభవ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ● వ్యవసాయ శాఖ వెబ్‌సైట్‌లో కనపడని ఖాతా నంబర్లు ● పొరుగు రాష్ట్రాల్లో ఉండే రైతులకు చుక్కెదురు



వేమూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : రైతుల కోసంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం రిజిస్ట్రేషన్ ప్రక్రియ లోపభూయిష్టంగా ఉంది. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న రైతుల ఖాతా నంబర్లు వ్యవసాయ శాఖ రికార్డుల్లో చాలా వరకు కనబడడం లేదు. దీంతో రిజిస్ట్రేషన్ కోసం వెళ్లిన రైతులకు చుక్కెదురవుతోంది. సొంత భూమి ఉండి ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్న వారికి సంబంధించిన భూమి ఖాతా నంబరు అసలు రిజిస్టర్ కావడం లేదు. 2025లో పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు అయిన రైతుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. రెండు ఖాతా నంబర్లు ఉన్న యజమానికి ఒకే ఖాతా నంబరుకు సంబంధించిన భూమి మాత్రమే రిజిస్టర్ అవుతోంది. దీనికి తోడు ఎప్పటికప్పుడు సర్వర్ పని చేయకపోవడంతో దరఖాస్తు ప్రక్రియ ఆగిపోతోంది. వ్యవసాయ శాఖ సిబ్బంది తమ వద్ద మ్యాపు కానటువంటి రైతులను సచివాలయంలో మ్యాపింగ్ చేయించుకోవాలని సూచిస్తున్నారు. ఈ ప్రయత్నం కూడా విఫలం అవుతోంది. మ్యాపింగ్ కానీ రైతులు.. వెబ్‌సైట్‌లో మరో ఆప్షన్ ఇవ్వకపోవడంపై రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు. దీనిపై రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు దృష్టి పెట్టి అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం అమలు అయ్యే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని, సాంకేతిక పరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

స్మార్ట్ హీట్ అలర్ట్ కార్డు ఆవిష్కరణ

తాడేపల్లి (కుంచనపల్లి), మే 17, (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో ఉన్న విపత్తుల సంస్థ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివాస్.. వేడిని తరిమి కొట్టండి థీమ్‌లో భాగంగా సంస్థ రూపొందించిన స్మార్ట్ హీట్ అలర్ట్ కార్డును స్పెషల్ సీఎస్ జయలక్ష్మి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాడేపల్లి పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు మజ్జిగ, వాటర్ బాటిల్‌తో పాటు స్మార్ట్ హీట్ ఎలెర్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ ప్రాంతంలో నమోదవుతున్న ఉష్ణోగ్రతల వివరాల కోసం కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలని తెలిపారు. గంట గంటకు స్థానికంగా ఉష్ణోగ్రతల అంచనా వివరాలు వాటిలో ఉంటాయని..అప్రమత్తంగా వ్యవహరించి వడదెబ్బ బారి నుండి బయటపడొచ్చన్నారు. ఉష్ణోగ్రతల హెచ్చరికలు రంగుల ద్వారా తెలుసుకోవచ్చన్నారు. బ్లూ కలర్ 35 డిగ్రీల సెంటిగ్రేడ్ అంతకంటే తక్కువ ఉంటే సేఫ్ జోన్ అని, ఎల్లో కలర్ 35-40 డిగ్రీల సెంటిగ్రేడ్ కొంచెం అసౌకర్యమని, ఆరెంజ్ కలర్ 41-44 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉంటే ఎక్కువ అసౌకర్యమని, రెడ్ కలర్ 45 డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే ఎక్కువ ఉంటే తీవ్ర ప్రమాదం కలిగి ఉంటుందని జయలక్ష్మి చెప్పారు. అత్యవసర సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్లు 1070, 112, 1800 4250 101లో సంప్రదించాలన్నారు.



కార్డును ఆవిష్కరిస్తున్న స్పెషల్ సీఎస్ జయలక్ష్మి

ఆశలపై అకాల వర్షం

❖ వాతావరణ మార్పులతో నిమ్మ రైతు దిగాలు ❖ పూత రాలి.. తగ్గిన దిగుబడులు ❖ ఎగుమతులు నిలిచి.. ధర నేల చూపులు ❖ కేజీ రూ.80 నుంచి రూ.40 పతనం


నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న కార్మికులు


చెట్టుకు తక్కువ సంఖ్యలో పిందె దశలో ఉన్న నిమ్మకాయలు

తెనాలి రూరల్,మే17(ఆంధ్రజ్యోతి): తెనాలి వ్యవసాయ మార్కెట్ నిమ్మకాయల క్రయ విక్రయాలకు పెట్టింది పేరుగా విరాజిల్లుతుంది. ఇక్కడకు తెనాలి, కొల్లిపర, చుండూరు, దుగ్గిరాల వంటి పలు మండలాల నుండి వేలాది ఎకరాల్లో సాగుచేపట్టిన నిమ్మరైతులు కాయలను తెచ్చి మార్కెటింగ్ చేస్తుంటారు. వ్యాపారులు లక్నో, యూపీ, జార్ఖండ్, నేపాల్ వంటి పలు ప్రాంతాలకు ఎగుమతులు చేస్తుంటారు. వేసవి కాలంలో కాయలకు డిమాండ్ ఉండి మంచి ధరలు పలుకుతాయి. దీంతో వేసవిపైనే రైతాంగం ఆశలు పెట్టుకుంటారు. నిమ్మసాగుకు దాదాపుగా సంవత్సరానికి రూ.60 - 80వేల వరకూ పెట్టుబడి అవుతుంది. దీనికి దిగుబడి మూడు దఫాలుగా వస్తాయి. వాతావరణం పూర్తి అనుకూలంగా ఉండి కాపు నిలబడితే రైతు ఆశించినంత దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది.

వాతావరణం మార్పులతో..

గతేడాది వాతావరణంలో మార్పులతో తొలి కోత ఆశాజనకంగా ఉన్నా.. రెండో కోతలో ఓ మాదిరిగా రైతులు నిలదొక్కుకున్నారు. మూడో కోత నుండి వాతావరణంలో మార్పులతో పూత రాలిపోయింది. దీంతో నిమ్మ దిగుబడి తగ్గింది. డిమాండ్‌కు తగ్గకాయలు లేకపోవడంతో వాటికి ధరలు పెరిగాయి. గత నెలలో కేజీ రూ.130 పలుకగా అదే నెల చివరకు వచ్చే సరికి రూ.80కి ధర దిగిపోయింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో ఎగుమతులు తగ్గాయి. దీంతో వారం క్రితం వరకూ కేజీ నిమ్మకాలు రూ. 60 కాగా ప్రస్తుతం రూ.40కి పడిపోయాయి. దీంతో రైతులు గిట్టుబాటు కాదని దిగాలు చెందుతున్నారు. ప్రస్తుతం నిమ్మకాలు ధర ఏ గ్రేడ్ క్వింటా రూ.4 వేలు, బీ గ్రేడ్ రూ.3300గా ఉంది. అకాల వర్షాలే తమ పంటలను దెబ్బతీశాయని రైతులు చెబుతుండగా.. వర్షాల కారణంగా కాయలకు డిమాండ్ లేక ఎగుమతులు నిలిచిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు.

ప్రవేశాలు పరిమితం..!

◆ ఏఎన్‌యూ పీజీ సైన్స్ కోర్సుల్లో సీట్ల కోత ◆ ఆగమేఘాలపై తాత్కాలిక వీసీ, రిజిస్ట్రార్ నిర్ణయం ◆ ఈ మేరకు విభాగాధిపతులకు ఆదేశాలు ◆ పాలక మండలి సభ్యులకు లేని సమాచారం



పెదకాకాని, మే 17(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తాత్కాలిక అధికారులు నిర్ణయాలు విమర్శలకు తావిస్తున్నాయి. తాజాగా వర్సిటీ తాత్కాలిక ఉన్నతాధికారులు పీజీ కోర్సుల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను తగ్గించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇది పలు అనుమానాలు, అనేక సందేహాలకు దారితీస్తోంది. ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ ఆయా విభాగాలకు కేటాయించిన సీట్ల సంఖ్యను తగ్గించాల్సిన అవసరం ఏముందని అధ్యాపకులు అంటున్నారు. వర్సిటీలోని విద్యార్థులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందిస్తోంది. అతి తక్కువ ఫీజుతో ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. దీంతో ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ వర్సిటీలు, విద్యా కేంద్రాలను తమ ఉన్నత విద్యకు మార్గంగా ఎంపిక చేసుకుంటున్నారు. పీజీ కోర్సుల్లో సీట్ల సంఖ్యను తగ్గించడం.. పేద, మధ్య తరగతి విద్యార్థులను ఆ కోర్సులకు దూరం చేయడమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పీజీ సైన్స్ కోర్సుల సీట్లకు ఎసరు

వర్సిటీలోని పీజీ సైన్స్ కోర్సుల్లో సీట్లకు వర్సిటీ ఉన్నతాధికారులు ఎసరు పెడుతున్నారు. బోటనీ, బయో టెక్నాలజీ, బయో కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, ఫారెస్ట్రీ తదితర వాటిలో కోర్సుకు 10 నుంచి 15సీట్లు కోత పెడుతున్నారు. దీంతో పేద విద్యార్థులకు పీజీ కోర్సులు మరింత భారం కానున్నాయి.

ప్రైవేటుకు మేలు చేకూర్చేందుకా?

ఏఎన్‌యూలో కొన్ని విభాగాల్లో, ప్రత్యేక కోర్సుల్లో సీట్ల సంఖ్యను పెంచడం జరిగింది దీంతో ఎక్కువ మంది విద్యార్థులు ఇక్కడే విద్యనభ్యసించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని ప్రైవేటు కళాశాలలకు లబ్ధి చేకూర్చేందుకే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని పలువురు అంటున్నారు. సాధారణంగా ఇలాంటి నిర్ణయాలు వర్సిటీ పాలక మండలి సభ్యులతో చర్చించి, వారి సలహాలు సూచనలతో ముందుకు సాగాలి. కానీ, పాలక మండలి సభ్యులకు ఏ మాత్రం సమాచారం లేకుండా.. వర్సిటీ రెక్టార్ కూడా సమావేశంలో పాల్గొనకుండానే తాత్కాలిక వీసీ కంచర్ల గంగాధరరావు, తాత్కాలిక రిజిస్ట్రార్ జి.సింహాచలం, కొందరు విభాగాధిపతులు అంతర్గత సమావేశం నిర్వహించారు. వారే నిర్ణయాలు తీసుకుని పలువురు అధ్యాపకులకు అనధికార ఆదేశాలు జారీ చేయడంతో ఆచార్యులు అవాక్కవుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, విద్యా శాఖాధికారులు, విద్యా శాఖ మంత్రి వర్సిటీలో విద్యార్థులకు నష్టం వాటిల్లేలా తీసుకుంటున్న నిర్ణయాలను పర్యవేక్షించాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

పరిశ్రమలకు మోక్షమెప్పుడు?

- వైసీపీ హయాంలో కుదేలైన రంగం
- జిల్లాల విభజనతో గుంటూరుకు తీవ్ర నష్టం
- పరిశ్రమలున్నా పల్నాడు పరిస్థితి అధ్వాన్నం
- లెక్కకు మాత్రమే పరిమితమైన ఎంఎస్ఎంఈలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా కనిపించని మార్పు

గుంటూరు, మే 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పారిశ్రామిక రంగంలో అత్యంత కీలకమైన జిల్లాగా పేరుపొందిన గుంటూరులో గడిచిన ఆరేళ్లుగా పారిశ్రామిక ప్రగతి అన్నదే కనిపించడం లేదు. గత వైసీపీ పాలనలో ఐదేళ్ల పాటు పరిశ్రమలు రాష్ట్రం వైపు చూసిన దాఖలాలే లేవు. ఆ ప్రభావం జిల్లాపై తీవ్రంగా పడింది. పోయిన అయిదేళ్లలో జిల్లాలో ఒక్కటంటే ఒక్కటి కూడా భారీ పరిశ్రమ వెలుగులోకి రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అప్పటి నాయకుల బెదిరింపులు, వేధింపులు తాళలేక చాలా మంది పక్కచూపులు చూశారు. అప్పటి అధికార పార్టీనేతలకు కప్పం కట్టలేక పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా పరిస్థితిలో పెద్దగా మార్పేమీ కనిపించడం లేదు.

● జిల్లాల విభజనతో భారీ దెబ్బ

జిల్లాల విభజనతో విభజిత గుంటూరుకు తీవ్ర అన్యాయం జరిగింది. మెజారిటీ పరిశ్రమలన్నీ పల్నాడుకు వెళ్లిపోయాయి. జిల్లాలో ఉన్న స్పిన్నింగ్, జిన్నింగ్ మిల్లులు దాదాపు ఖాయిలా అంచుకు చేరుకున్నాయి. అవి మూసివేత ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. పొగాకు ఆధారిత పరిశ్రమల పరిస్థితి కూడా ఆశించినంత స్థాయిలో లేదు. 2022 ఏప్రిల్‌లో జరిగిన జిల్లాల పునర్విభజనకు ముందు ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.250 కోట్లు అంతకు మించి పెట్టుబడులున్న భారీ పరిశ్రమలు 81 ఉండగా, వాటిలో 53 పరిశ్రమలు పల్నాడు జిల్లాకే దక్కాయి. చెట్టినాడు, కేసీపీ, పరాశక్తి వంటి భారీ సిమెంటు పరిశ్రమలు, పిడుగురాళ్ల కేంద్రంగా ఉన్న సున్నపు బట్టీల పరిశ్రమ, చిలకలూరిపేట స్పిన్నింగ్, టెక్స్‌టైల్స్ హబ్‌లు అన్నీ పల్నాడు పరమయ్యాయి. ఈ జిల్లాలో కూడా కొత్తగా వచ్చిన పరిశ్రమలు లేవు. సముద్రతీరం, ఆక్వారంగం విస్తారంగా ఉన్న బాపట్ల జిల్లా పరిస్థితి కూడా ఇంచుమించు అలానే ఉంది. బాపట్ల జిల్లాకు 2 భారీ పరిశ్రమలు పోగా మిగిలిన 26 పరిశ్రమలతో గుంటూరు జిల్లా సరిపుచ్చుకోవాల్సి వచ్చింది.

● ఎంఎస్ఎంఈ పరిశ్రమల గుట్టు

జిల్లాల పునర్విభజన నాటికి ఉమ్మడి గుంటూరులో 15,938 ఎంఎస్ఎంఈ పరిశ్రమలు ఉండగా, 8 వేల ఎంఎస్ఎంఈలు పల్నాడుకు, 1500 ఎంఎస్ఎంఈలు బాపట్ల జిల్లాకు వెళ్లాయి. గుంటూరు జిల్లాకు 6,425 పరిశ్రమలు మాత్రమే మిగిలాయి. ప్రస్తుతం ఈ సంఖ్య భారీగా పెరిగింది. గుంటూరు జిల్లాలో 94,189 ఎంఎస్ఎంఈలు ఉండగా అందులో సూక్ష్మ పరిశ్రమలే 90,911 ఉన్నాయి. బాపట్ల జిల్లాలో 27,950 ఎంఎస్ఎంఈలు ఉండగా, వాటిలో 27,758 సూక్ష్మ పరిశ్రమలు, పల్నాడు జిల్లాలో 34,990 ఎంఎస్ఎంఈలకు గానూ 34,695 సూక్ష్మ పరిశ్రమలు ఉన్నాయి. మొత్తం ఎంఎస్ఎంఈల్లో 95 శాతానికి పైగా సూక్ష్మ పరిశ్రమలే ఉన్నాయి. గణాంకాలను బట్టి ఎంఎస్ ఎంఈల సంఖ్య పదిరెట్లు పెరిగినట్లు కనిపిస్తున్నా.. దాని వెనక పెద్ద మతలబు ఉన్నట్లు తెలుస్తోంది.ఎంఎస్ఎంఈల భావన మార్చడంతో ఈసంఖ్య అమాంతం పెరిగిపోయింది. ఇళ్ల దగ్గర నడుపుకునే చిల్లరకొట్లు, దుకాణాలు ఎంఎస్ఎంఈల జాబితాలో చేర్చారు. కానీ కొత్తగా వచ్చిన ఎంఎస్ఎంఈలు జిల్లాలో పెద్దగా లేవని తెలుస్తోంది.

● రెండేళ్లలో వచ్చిన పరిశ్రమలు, ఉద్యోగాలు శూన్యం

2014- 19 నాటి టీడీపీ ప్రభుత్వంలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఎంతో ఆసక్తి చూపారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక వారంతా కనుమరుగైపోయారు. ప్రభుత్వ గణాంకాలే ఈ విషయాన్ని నిర్ధారిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే ప్రకారం 2014 నుంచి 2021 వరకూ జిల్లాలో 20 మెగా, భారీ పరిశ్రమల స్థాపన జరగ్గా, ఆ తరువాత ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. 2014- 21 మధ్య కాలంలో గుంటూరు జిల్లాలో 7, బాపట్ల జిల్లాలో 4, పల్నాడు జిల్లాలో అత్యధికంగా 9, మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 20 మెగా భారీ పరిశ్రమల స్థాపన జరగ్గా 2,485.47 కోట్ల రూపాయల పెట్టుబడులు, 4,500 మందికి ఉద్యోగాలు వచ్చాయి. 2021-24 మధ్య ఈ మూడు జిల్లాల్లో ఒక్క భారీ పరిశ్రమగాని, రూపాయి పెట్టుబడిగానీ, ఒక్కరికి ఉద్యోగం కానీ రాలేదని గణాంకాలు చెబుతున్నాయి. కాగా ఈ ఏడాది కాలంలోనూ అదే పరిస్థితి కొనసాగుతుండడం విషాదం



● ఐదేళ్ల గ్రహణం వీడేనా?

గడిచిన ఐదేళ్లలో పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన అనేది జిల్లాలోని యువతకు కలగానే మిగిలిపోయింది. ఖనిజ, సహజ వనరుల ఖిల్లాగా ఉన్నా, రోడ్లు, రైల్వే వంటి మౌలిక సదుపాయాల కల్పన విస్తారంగా ఉన్నా జిల్లాలో పారిశ్రామిక ప్రగతి అంతకం తకూ దిగజారిపోతోంది. ఈ కారణంగా జిల్లాలోని యువతకు పని దొరకడమే కష్టంగా మారిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితిలో మార్పు వస్తుందని ఆశించినవారికి నిరాశే ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్కువ పెట్టుబడితో, ఎక్కువ ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించాలని కోరుతున్నారు.



గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

తెనాలిరూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడి ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని, కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామంలో కనీస మౌలిక వసతులు కల్పించి మోడల్ గ్రామాలుగా తీర్చి దిద్దుతోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యునికేషన్‌శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామంలో ఆయన గ్రీవెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వివిధ శాఖల అధికారులతో కలసి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వారి నుండి అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులకు అందించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అధికంగా రైతు వారి సమస్యలు, డ్రెయిన్లు, డొంకలు, రోడ్లు, గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తదితర అంశాలతో పెమ్మసానికి వినతులు అందాయి. అనంతరం సభలో పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ నియోజవర్గంలో ఎదుర్కొంటున్న సమస్యను నేరుగా మంత్రి మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. అక్కడ తక్షణమే పరిష్కారానికి చొరవ చూపుతారని చెప్పారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతుల డొంక సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా చూస్తామన్నారు. రేషన్ ఇతర సమస్యపై అధికారులకు తెలపడం జరిగిందని త్వరలోనే కార్డులు అందిస్తామన్నారు.

నేడు కొల్లిపరలో మెగా మెడికల్ క్యాంపు

కొల్లిపర, మే 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆదివారం ఉదయం 9నుండి సాయంత్రం 5గంటల వరకు మెగా మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యాదర్శులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా పాల్గొని, క్యాంపును ప్రారంభించనున్నట్లు తెలిపారు. పలు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపు గురించి గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యాలయ ఏఓ ప్రతాప్‌రెడ్డి, ఈవోపీఆర్డీ భార్గవ్ పాల్గొన్నారు.

భరతమాత గర్వపడేలా ఆపరేషన్ సిందూర్

● త్రివిధ దళాల సైనికులకు సంఘీభావం తిరంగా ర్యాలీ

● కేంద్ర మంత్రి పెమ్మసాని, మంత్రి నాదెండ్ల



తిరంగా ర్యాలీలో పాల్గొన్న మంత్రులు పెమ్మసాని, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి, మే 17(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ మన దేశ సత్తాను ప్రపంచ దేశాలకు తెలియచేయగలిగితే, మన భరతమాత గర్వపడేలా పాక్ ఉగ్రమూకలను మట్టుపెట్టటం గర్వించదగిన విషయమని, యువతలో దేశభక్తి రగులుతోందని, ఏ దేశ సైన్యం వీరికి ఎదురు నిలువలేరని కేంద్ర కమ్యూనికేషన్‌ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. తెనాలిలో శనివారం ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా కూటమి నాయకుల ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక చినరావూరు పార్క్ నుంచి మార్కెట్ సెంటర్‌లోని మున్సిపల్ కార్యాలయం వరకు జాతీయజెండాలు చేతబట్టి, భారతమాతాకు జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులతోపాటు అధికారులు, మాజీ సైనికులు, ఎన్.సి.సి విద్యార్థులు ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీలో ఎన్నారై విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 300 మీటర్ల జాతీయ జెండా ఆకర్షణగా నిలిచింది. చిన్నారులు, కూటమి నాయకులు భారీ పతాకాన్ని ఎత్తిపట్టుకుని చివరి వరకు దింపకుండా ర్యాలీ నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులను తుదముట్టించి, భారత దేశ కీర్తిని, పోరాట శక్తిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన ఘనత మోడీకి దక్కుతుందని మంత్రులు చంద్రశేఖర్, మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటిలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని అణచివేయటంలో సత్తాచాటిన భారత సైనికులకు వందనం చెబుతూ, యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్‌లకు రుణపడి ఉంటామని, వారికి సెల్యూట్ చేశారు. వీరితోపాటు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్రావు, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సాధనలో ప్రజలు భాగస్వాములు కావాలి

● మంత్రి మనోహర్



తమ సమస్యలు వివరిస్తున్న వృద్ధురాలిని ఓదార్చుతున్న మంత్రి మనోహర్

తెనాలి, మారీసుపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర సాధనలో ప్రజలు భాగస్వాములు కావాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం తెనాలి పట్టణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని మంత్రి మనోహర్ వివిధ విభాగాల అధికారులతో కలసి నిర్వహించారు. ముందుగా ఉదయం బుర్రిపాలెం రోడ్డులోని శివాజీ బొమ్మ దగ్గర నుండి కవిరాజా పార్కు మీదగా మహాత్మాగాంధీ కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్ వరకు వివిధ పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తు వార్డు ప్రజల సమస్యలను మంత్రి మనోహర్ అడిగి తెలుసుకున్నారు. ముందుగా నందులపేటలోని పోస్టు ఆఫీసు బజారులో సైడు కాలువలోని మురుగుని చూసి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈదే ప్రాంతానికి చెందిన దివ్యాంగుడు జి.వెంకటేశ్వరావు తనకు పింఛను రావడం లేదని మంత్రిని వేడుకున్నాడు. స్పందించిన మంత్రి అధికారులను పిలిచి వెంటనే పింఛను వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కవి రాజా పార్కులో జరగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముస్లిం బజార్‌లో వృద్ధురాలు ఆకుల సీతమ్మ ఇల్లు కూలిపోయిందని తన అనారోగ్యానికి మందులకు సహాయం చేయాలని మంత్రిని కోరగా తహసీల్దార్ గోపాలకృష్ణను వెంటనే సమస్యను పరిష్కరించాలని మంత్రి సూచించారు. బండ్లమూరి వీధిలో పారిశుద్ధ్య కార్మికులతో కలసి స్వయంగా సైడు కాలువలోని మురుగుని మంత్రి మనోహర్ తొలగించారు. పలు వార్డుల్లోని ప్రజలు వీధి కుక్కల బెడద పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా మునిసిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధికకు పలు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మార్కెట్ సెంటర్‌లో అధికారులతో కలసి స్వయంగా చీపురు పట్టి రోడ్లను శుభ్రపరిచారు. ఆయన వెంట అధికారులున్నారు.

వృద్ధులు, దివ్యాంగుల సమస్యల ఏకరువు

పలు ప్రాంతాల్లో వృద్ధులు వారి సమస్యలను ఆవేదనతో మంత్రి నాదెండ్లకు వివరించారు. వారి సమస్యలు వింటూ, వారితోపాటే ఇంటి గడపలపై, మెట్లపై కూర్చుని చేతిలో చెయ్యి వేసుకుని ఆప్యాయంగా పలకరిస్తూ వారికి ఓదార్పునిచ్చారు మంత్రి. వారికి ధైర్యం చెబుతూ. ప్రభుత్వ పథకాలు ఎవరి అవసరం లేకుండా ఇంటి దగ్గరకే అధికారులు వచ్చి అందించేలా ఏర్పాట్లు చేస్తామని మనోహర్ వారికి హామీ ఇచ్చారు. వెంటనే ఆయా ప్రాంతాల సచివాలయ సిబ్బందిని పిలిచి వారి సమస్యలను నమోదు చేసుకుని వెంటనే పథకాలు అందించేలా చూడాలని ఆదేశించారు. పర్యవేక్షించాలని కమిషనర్ శేషన్న, తమసీల్దార్ గోపాలకృష్ణకు సూచించారు.

పేదలకు వరం.. సీఎంఆర్ఎఫ్

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): అనారోగ్యసమస్యలతో ఖరీదైన వైద్యం పొందేందుకు పేదలకు వరంలా సీఎంఆర్ఎఫ్ ఫండ్ నిలుస్తుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. పట్టణంలోని బాలాజీరావుపేటకు చెందిన షేక్ మస్తాన్‌బీ అనారోగ్యసమస్యలతో బాధపడుతూ వైద్యఖర్చుల నిమిత్తం ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను సంప్రదించగా సీఎంఆర్ఎఫ్ ఫండ్‌కి అప్లికేషన్ అందించారు. శనివారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ వారి స్వగృహానికి వెళ్లి బాధితురాలికి వైద్యసేవల నిమిత్తం రూ.4లక్షల చెక్కును అందజేశారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

తెనాలి, మారీసుపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌రోడ్డులో శనివారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన వీధి నాటకం ప్రదర్శన జరిగింది. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కృష్ణకిషోర్ నవ చైతన్య కళామండలి కళాకారులు వీధినాటకం ప్రదర్శించారు. సిరి మహిళా సాధికారిక వెల్ఫేర్ సొసైటీ తెనాలి, టీఐ ప్రాజెక్ట్ మేనేజర్ పాల్గొన్నారు.



ఆసుపత్రిలో కాలువలు శుభ్రం చేయిస్తున్న మంత్రి మనోహర్

ఆసుపత్రి అంటారా దీనిని..

● శానిటేషన్‌పై ఆగ్రహవ్యక్తం చేసిన మంత్రి మనోహర్

తెనాలి రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో వచ్చె రోగులకు నాణ్యమైన వైద్యసేవలందించాల్సిన ఆసుపత్రిలో నిర్వహణలోపంతో శానిటేషన్ అధ్వానంగా ఉంటే రోగం ఎల్లా నయమవుతుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహవ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వవైద్యశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మనోహర్ వైద్యశాలను సందర్శించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గుర్తించారు. వార్డులో పర్యటించిన క్రమంలో దుర్గంధం వెదజల్లుతుండటంతో వైద్యశాల ఆర్ఎంవోను పిలిచి శానిటేషన్‌పై ఎందుకు దృష్టిపెట్టడంలేదంటూ ప్రశ్నించారు. వైద్యశాలకు పలు మండలాల నుండి పెద్దసంఖ్యలో అనారోగ్య సమస్యలతో రోగులు వస్తారని వైద్యం అందించేందుకు డాక్టర్లు చికిత్సచేసిన శానిటేషన్ సరిగాలేకపోతే వ్యాధి ఎట్లానయమవుతుందని మండిపడ్డారు. ఆసుపత్రి అభివృద్ధి పనుల నిమిత్తం రూ.కోటి విడుదల చేశామని ఆ డబ్బులతో ఏ విధమైన అభివృద్ధి పనులు చేపట్టారో తెలపాలన్నారు. కొన్ని పనులు జరుగుతున్నాయని ఇంకా జరగాల్సినవి ఉన్నాయంటూ బదులివ్వడంతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. శానిటేషన్ సూపర్ వైజర్ సాగర్‌ను పిలిచి విధులు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదే తీరు కొనసాగితే బాధ్యతల నుడి తప్పుకోవాల్సి ఉంటుందని ఘాటుగా హెచ్చరించారు. మునిసిపల్ కమిషనర్ బండిశేషనన్న ఆసుపత్రి పరిసరాల్లో కాలువలు తీసేందుకు ముప్పైరోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు.

ఏ ఒక్కరోగి ప్రాణాలు విడవకూడదు

తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలకు అత్యవసర వైద్యం కోసం వచ్చి ఏ ఒక్క పేదరోగి ప్రాణాలు విడవకూడదని వారికి సకాలంలో అత్యాధునిక పరికరాలతో వైద్యం అందేలా తాను బాధ్యత తీసుకుంటానని ప్రముఖ వైద్యులు డాక్టర్ నన్నపనేని ప్రతాప్ చెప్పారు. శనివారం తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలకు వచ్చిన మంత్రి మనోహర్‌తో డాక్టర్ నన్నపనేని ప్రతాప్ మాట్లాడారు. తన తండ్రిపేరుతో పేదవాడి ప్రాణాలకు భరోసా కల్పించేలా జిల్లా వైద్యశాల క్యాజువాలిటీని నూతన సాంకేతిక పరిజ్ఞానంతో తీర్చిదిద్ది అధునాతన పరికరాలను ఏర్పాటు చేసి ఒకే సారి 15మంది రోగులు ప్రాణాపాయ స్థితితో వచ్చినా తక్షణవైద్యం అందించి ఊపిరి నిలబెట్టిలా తాను బాధ్యత తీసుకుంటానని చెప్పారు. అందుకు అవసరమైన ప్లాన్ కాపీని మంత్రికి చూపించి వివరించారు. డాక్టర్ నన్నపనేని ప్రతాప్ సేవలను మంత్రిమనోహర్ అభినందించారు.

తాకట్టు పెట్టిన ఆస్థిని అమ్మారని ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): తాకట్టు పెట్టిన ఆస్థిని అమ్మారంటూ బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఐతానగర్ డాంగే వీధికి చెందిన కప్పల లక్ష్మీనారాయణ హైదారాబాదు శ్రీపురం కాలనీకి చెందిన కొల్లిపర వెంకట మోహన్ జాలరావు, కొల్లిపర ఆదిశేషమ్మ, పెదురి ధర్మసాయి, పెదురి ఏడుకొండలు వద్ద ఆస్థిని కొనుగోలు చేశారు. అయితే తాకట్టులో ఉన్న ఆస్థిని మభ్యపెట్టి లక్ష్మీనారాయణకు అమ్మకం చేశారు. దీనితో మోసపోయానని లక్ష్మీనారాయణ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

ప్రణాళికతో ఎంసెట్‌లో ర్యాంకు

తెనాలి అర్బన్, మే 17 (ఆంధ్ర జ్యోతి): ఎంసెట్‌లో ర్యాంకు సాధించేందుకు తగిన ప్రణాళిక అవసరమని దళిత విశ్వ విద్యాలయం ఉపకులపతి గుజ్జర్లమూడి కృపాచారి తెలిపారు. ప్రకాశం రోడ్డులోని క్రాంతి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం స్రామాట్ కాన్ఫరెన్స్ హాలులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 19న జరగనున్న ఎంసెట్ పరీక్షకు హాజరు కానున్న విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. జెట్టి విజయశేఖర్, అమిరిశెట్టి శ్రీధర్, గిరిధర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.





అవగాహన ర్యాలీలో ఆర్ఎంవో మల్లికార్జునరావు తదితరులు

శారీరక శ్రమ.. ఆహారపు అలవాట్లతో అదుపులో బీపీ

తెనాలి రూరల్, మే17(ఆంధ్రజ్యోతి): మంచి ఆహారపు అలావాట్లు, వారంతో ఐదురోజుల పాటు కనీసం అర్ధ గంటైనా శారీరక శ్రమ చేస్తే బీపీ (హైపర్‌టెన్షన్)ని అదుపుచేయవచ్చని జిల్లా ప్రభుత్వవైద్యశాల వైద్యులు డాక్టర్ శ్రీకాంత్ చెప్పారు. శనివారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో వరల్డ్ హైపర్ టెన్షన్ డేను పురస్కరించుకుని రోగులకు, వారి సహాయకులకు బీపీ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ అధిక రక్తపోటుతో బాధపడేవారి సంఖ్య నానాటికి పెరిగిపోతుందన్నారు. అందుకు ప్రధానంగా జీవనశైలిలో మార్పులేనన్నారు. 30సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ బీపీ చెక్ చేయించుకోవడం మంచిదన్నారు. ఇది సైలెంట్ కిల్లర్ అని గుర్తుంచుకోవలని వ్యాధి లక్షణాలు 90శాతం కనిపించవన్నారు. తలవెనుక భాగంలో నొప్పి, కళ్లుతిరగడం వంటి లక్షణాలను చూడవచ్చన్నారు. ఎన్‌పీహెచ్ఎల్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ డాక్టర్ మంజూష, ఫిజియోథెరిపిస్ట్ డాక్టర్. ఎస్ అపర్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.రాజేశ్వరి, హెడ్‌నర్స్ సుజాతబాయిలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ఆడియోమెట్రీషియన్ రాజేష్, ఎన్‌సీడీ స్టాఫ్‌నర్సులు షేక్ సత్తర్, ఎ. పరిపూర్ణ, కె. గాయత్రి, కె. శ్రావణి, సోషల్ వర్కర్స్, నర్సింగ్ విద్యార్థిని విద్యార్థులు, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా ప్రత్యేక అధికారి కన్నాబాబు



అవగాహన ర్యాలీలో జిల్లా ప్రత్యేకాధికారి కన్నబాబు

పొన్నూరుటౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రత్యేక అధికారి కన్నాబాబు పేర్కొన్నారు. శనివారం పొన్నూరు పట్టణంలో బీట్ దా హీట్ కార్యక్రమం నిర్వహించారు. ఐలాండ్ సెంటర్ నుంచి మున్సిపల్ అధికారులు మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. 300 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. కన్నబాబు మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉందన్నారు. వృద్ధులు, చిన్నారులు, మహిళలు, వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మున్సిపల్ కమీషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. చేబ్రోలు ఎంపీడీవో కార్యాలయం వద్ద వేడిమి ఓడించండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి కార్యక్రమాన్ని శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించారు. ప్రతిజ్ఞ చేసి మానవహారాలు నిర్మించారు. ఎంపీడీవో ఉమాదేవి, తహసీల్దారు శ్రీనివాసశర్మ, టీడీపీ మండల అధ్యక్షుడు షైలా వెంకట రామరాజు అధకారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా పొన్నూరు

పొన్నూరుటౌన్, మే 17: పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని స్వచ్ఛ ఆంధ్ర ప్రత్యేక అధికారి కె.కన్నబాబు అన్నారు. శనివారం పట్టణంలోని డంపింగ్ యార్డును ఆయన పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు డంపింగ్ యార్డులో చెత్తను తరలించే ప్రక్రియ గురించి వివరించారు. త్వరలోనే డంపింగ్ యార్డును పూర్తిగా ఖాళీ చేసి స్థానికంగానే సెగ్రిగేషన్ జరిగేలా కృషి చేస్తున్నామన్నారు. మున్సిపల్ పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బీపీ పేషంట్లు జాగ్రత్తలు పాటించాలి



కొల్లిపరలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది

కొల్లిపర, మే 17 (ఆంధ్రజ్యోతి): బీపీ ఉన్న వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రపంచ బీపీ దినోత్సవం సందర్భంగా వైద్యాధికారులు అవగాహన సైకిల్‌పై ర్యాలీ నిర్వహించారు. బీపీపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు లక్ష్మీ, మణిమ్మ, ఆశ కార్యకర్తలు మల్లేశ్వరి, పద్మ, ప్రేమకుమారి, వాణి పాల్గొన్నారు.

20న జిల్లా స్థాయి చెస్ పోటీలు

పొన్నూరుటౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న జిల్లా స్థాయి చెస్ పోటీలు పొన్నూరులో నిర్వహిస్తున్నట్లు పొన్నూరు చెస్ అకాడమి కార్యదర్శి షేక్ బాజీ బాషా తెలిపారు. శనివారం చెస్ పోటీల కర పత్రాలను చెస్ అకాడమీ కార్యాలయంలో ఆవిష్కరించారు. పొన్నూరు పట్టణంలోని బాలాజీ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అండర్ 11 ఓపెన్, అండ్ బాలికల చాంపియన్ షిప్ జిల్లా స్థాయి పోటీలు ఉదయం ప్రారంభమవుతాయని తెలిపారు. విజేతలకు రూ 5 వేల ప్రైజ్ మనీతో పాటు ఇద్దరు టాప్ ప్లేస్‌లో నిలిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9000 918401 నెంర్‌కు సంప్రదించాలన్నారు. కోచ్ గంగరాజు మురళికృష్ణ, రాంబాబు, షేక్ కరీముల్లా పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కొల్లిపర, మే 17(ఆంధ్రజ్యోతి): పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈవోపీఆర్‌డీ భార్గవ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, తూములూరు, అత్తోట తదితర గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కలిగించారు. తహీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అవరణ పరిశుభ్రం చేశారు. సబ్ రిజిస్ట్రార్ అధినారాయణరెడ్డి, డీటీ ఉప్పాల రాజేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కొల్లిపరలో నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ ర్యాలీ

సమ్మెను జయప్రదం చేద్దాం..

తెనాలిరూరల్,మే17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో రైతు కూలీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని సంగం జాగర్లమూడిలో జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావుతో కలిసి ఉపాధిహామి కూలీలను కలిసి మాట్లాడారు. సోమవారం మండల కేంద్రాల సచివాలయాలవద్ద జరిగే ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొని హక్కుల సాధనకు మద్దతు తెలపాలని కోరారు. పలువురు రైతు కూలీలు, తదితరులు పాల్గొన్నారు.



గజవాహనంపై శ్రీనివాసుడు

శ్రీనివాసునికి గ్రామోత్సవం

తెనాలి అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠపురం ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీలక్ష్మీపద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో శనివారం గజవాహన గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. పట్టణంలోని విజయవాడ రోడ్డు, మెయిన్‌రోడ్డు, బోసురోడ్డు, వహాబ్‌రోడ్డు మీదుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించిన వాహనంలో ఊరేగించారు. ఆదివారం ఎదురుకోలోత్సవం, స్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతాయని ఈవో అనుపమ తెలిపారు.



నేడు మంగళగిరిలో మహానాడు

మంగళగిరి సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమం ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో జరుగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. నియోజకవర్గంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు పట్టణంలో తిరంగా యాత్ర

మంగళగిరి, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో భారత సైనిక దళాలకు సంఘీభావంగా మంగళగిరి పట్టణంలో ఆదివారం తిరంగా యాత్ర నిర్వహిస్తున్నట్టు కూటమి నేతలు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నుంచి మెయిన్ బజారు మీదుగా పాత కూరగాయల మార్కెట్ వద్ద గల గాంధీ విగ్రహం వరకు జాతీయ పతాకాలతో తిరంగా యాత్ర జరుగుతుందన్నారు. కూటమి శ్రేణులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎండిన మొక్కజొన్నను తగలబెట్టొద్దు

దుగ్గిరాల, మే 17 (ఆంధ్రజ్యోతి): రైతులు మొక్కజొన్న పంటను కోశాక మిగిలిన అవశేషాలను తగలబెట్టడం సరికాదని మండల వ్యవసాయాధికారి పి.శిరీష అన్నారు. అవశేషాలను నేలలో కలియ దున్నటం ద్వారా భూమి సారవంతం కానుందని గుర్తించాలన్నారు. అలాకాకుండా నిప్పుపెట్టడం ద్వారా కాలుష్యం పెరుగుతుందని, పక్క పొలాలకు మంటలు వ్యాపించి, సాటి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని తెలుసుకోవాలన్నారు. రోటోవేటర్‌తో కలియదున్నాక సూపర్ ఫాస్పేట్ చల్లాలని సూచించారు.

పోలేరమ్మ ఉత్సవ విగ్రహం అందజేత



అర్చకులకు పోలేరమ్మ ఉత్సవ విగ్రహాన్ని అందజేస్తున్న దాతలు

పెదనందిపాడు, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలేరమ్మ తల్లి దేవస్థానానికి దాత ఉత్సవ విగ్రహాన్ని శనివారం అందజేశారు. మండల పరిధిలోని అన్నపర్రు గ్రామానికి చెందిన కే ప్రసాద్ రూ.లక్షా,60వేల విలువైన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కమిటీ నిర్వాకులు, అర్చకులకు అందజేశారు. తొలుత అర్చకులు శ్రీనివాసరావు, సునీల్‌శర్మలు అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు.

నేటి నుంచి పోలేరమ్మ తిరునాళ్ల

పోలేరమ్మ తిరునాళ్ల మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం సాయంత్రం మల్లెపూల పూజ, అన్నదాన కార్యక్రమం, సోమవారం కుంకుమపూజ, మంళవారం అమ్మవారికి తలంట్లు, పొంగళ్ల ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చర్చి వార్షిక వేడుకలు

పెదనందిపాడు, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అన్నవరం లూథరన్ చర్చి 12వ వార్షిక వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ షాలేమురాజు ప్రత్యేక ప్రార్థనలు చేసి, భక్తులకు సందేశం అందించారు. అనంతరం సంఘస్థులు, దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రైతన్న డెయిరీ వారు భక్తులకు మజ్జిగ, తాగునీటిని ఉచితంగా అందించారు. గ్రామస్థులు, కమిటీ పెద్దలు రైతన్న డెయిరీ వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మంగళగిరి, మే 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు మంగళ గిరి రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. ఆత్మకూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఏపీఎస్పీ బెటాలియన్ రోడ్డుకు ఎదురుగా గుంటూరు - విజయవాడ హైవేపై నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని ఈ నెల 12వ తేదీ న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిందన్నారు. సదరు వ్యక్తి విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడని తెలిపారు. అతడి వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు మంగళగిరి రూరల్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

కవిత స్రవంతి ఆవిష్కరణ

గుంటూరు(తూర్పు), మే 17 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ రచయితల సంఘం, తొంభై ఏళ్ల ప్రయాణానికి సూచికగా ప్రముఖ రచయితలు రచించిన కథా స్రవంతి, కవిత స్రవంతుల ఆవిష్కరణ కార్యక్రమం శనివారం స్థానిక బృందావన్‌గార్డెన్స్, సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ హాజరై నాలుగు కవితా స్రవంతి పుస్తకాలను ఆవిష్కరించారు. సభకు సాహితీవేత్త భూసూరపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా, సభను వల్లూరి శివప్రసాదు నిర్వహించారు. ఈ సందర్భంగా పాపినేని శివశంకర్ మాట్లాడుతూ ఈ పుస్తకాలు చదవడం నేటి తరానికి అవసరమని అన్నారు. పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఛాయ్‌రాజ్, ఎండ్లూరి సుధాకర్, నూతలపాటి గంగధర్‌ల కవితాన్ని ఈ తరానికి సులభతరం చేసి అందజేస్తున్న అరసం సేవలను అభినందిస్తున్నట్టు పేర్కొన్నారు. భూసూరపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ పుస్తకాలు కవి ఆత్మీయతను ప్రతిబించేలా ఉన్నాయని అన్నారు. మందరపు హైమావతి, ఎండ్లూరి మానస, దివికుమార్‌లు మాట్లాడుతూ తాము రాసిన కవితలకు నేటి తరానికి మార్గదర్శకత్వం అవుతుందని చెప్పారు.

గ్రామాల్లో, ఇంటి పరిసరాల్లో శుభ్రతను పాటిద్దాం

● స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్రలో డీపీవో సాయికుమార్



దుగ్గిరాలలో స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర దివస్‌లో భాగంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న డీపీవో సాయికుమార్,

దుగ్గిరాల, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణాలు, నగరాలు, గ్రామాలతోపాటు, మనఇంటి పరిసరాలను సైతం శుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర సంకల్పం నేరవేరుతుందని, జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేక అధికారి బీ సాయి కుమార్ అన్నారు. మూడో శనివారం సందర్భంగా మండలంలోని పలుగ్రామాల్లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర అవగాహన ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. దుగ్గిరాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న డీపీవో సాయికుమార్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకుంటూ, వేడిని తగ్గించేందుకుగానూ తీసుకోవలసిన చర్యలను వివరించి, మొక్కలను విరివిగా నాటాలన్నారు. మండలపరిషత్ కార్యాలయం నుంచి బంగ్లాలోని సంపదషెడ్ల వరకూ ర్యాలీ నిర్వహించారు. రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని కాల్వకట్ట పరిసరాలను, పారిశుధ్య కార్మికులతో కలిసి శుభ్రం చేశారు. సంపద షెడ్లను, సోప్‌పిట్‌లను పరిశీలించి, వర్మికంపోస్ట్‌ను అందించారు. సర్పంచ్ కుషీబాయి, డిప్యూటీ ఎంపీడీవో జవహర్‌లాల్, ఏపీఎం సురేష్‌కుమార్, ఈవో కె.వివేకానంద, గూడూరు వెంకట్రావు, వల్లూరు నరసింహారావు, పర్వతనేని హర్ష, కొంగర జోగేంద్రప్రసాద్, పసుపులేటి గణేశ్, పీహెచ్‌సీ డాక్టర్ అబ్దుల్‌రహ్మాన్, పలువురు కూటమి నాయకులు పారిశుద్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

మంగళగిరి సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళగిరి - తాడేపల్లి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం పచ్చదనం, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంటీఎంసీ అధికారులు, సిబ్బంది ర్యాలీగా తిరిగి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ కే శకుంతల మాట్లాడుతూ మంగళగిరిని చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ మంగళగిరి నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వేసవిలో ఎండల తీవ్రతను నివారించేందుకు ప్రతి ఒక్కరూ చెట్లను పెంచి పచ్చదనాన్ని పరిరక్షించాలని కోరారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన రహదార్ల వెంబడి బస్సు షెల్టర్లతోపాటు 55 చలివేంద్రాలు, అయిదు మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారన్నారు. ప్రజలు, ఎన్జీవో సంస్థలు బీట్ ది హీట్ కార్యక్రమంలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ పట్లూరి శ్రీనివాసరావు, మెప్మా, ఎంటీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఎంటీఎంసీ అధికారులు

జగన్ అక్రమాలపై కేంద్రం దూకుడు పెంచాలి

● మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

తుళ్లూరు, (వెంకటపాలెం)మే17 (ఆంధ్రజ్యోతి): జగన్ అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం దూకుడు పెంచాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం వెంకటపాలెం వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పేద ప్రజలకు పిచ్చి మందు అమ్మి.. ప్రాణాలు బలిగొన్నారన్నారని విమర్శించారు. కిడ్నీలు, లివర్ పాడయ్యే కల్తీ మద్యాన్ని వైసీపీ ప్రభుత్వంలో విక్రయించారని ఆరోపించారు. మద్యం కుంభకోణంపై సిట్ దర్యాప్తు బాగానే జరుగుతుందన్నారు. ఇంకా వేగవంతం చేసి, రూ.లక్ష కోట్లు రికవరీ చేసి.. పిచ్చి మందు తాగి అనారోగ్యం పాలైన వారికి ఆ డబ్బుని సాయం కింద అందజేయాలని డొక్కా డిమాండ్ చేశారు. బిగ్ బాస్ దగ్గర రూ.లక్ష కోట్లున్నాయా.. అని విలేకరులు ప్రశ్నించగా.. ఎన్ని రూ.లక్ష కోట్లున్నాయో తెలిదన్నారు. తనకు తెలిసి రెండు మూడు రూ.లక్షల కోట్లు ఉంటాయని డొక్కా పేర్కొన్నారు.

రోడ్డు కింద ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సిద్ధమే

● గ్రామానికి ఆనుకొని ఉన్న స్థలాలు కేటాయించాలి



తుళ్లూరు రామాలయం ఆవరణలో సమావేశమైన ఈ- 5 రోడ్డు బాధితులు

తుళ్లూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): తుళ్లూరులోని కొత్తూరులో ఈ-5 రోడ్డు కింద ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారు శనివారం కొదండ రామస్వామి ఆలయం ఆవరణలో సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో రాజధాని నిర్మాణ పనులు ముమ్మరమయ్యాయి. కొన్ని గ్రామాల్లో రోడ్డు కింద ఇళ్లు, స్థలాలు పోతున్నాయి. అం దుకు తగిన పరిహారాన్ని సీఆర్డీఏ అధికారులు ఏర్పాటు చేసి ఇళ్లు నిర్మించుకోవటాకి స్థలాలు కేటాయిస్తున్నారు. నిర్మాణ ఖర్చులు సీఆర్డీఏ భరిస్తుంది. కొత్తూరులో దాదాపు 200 కుటుంబాలు ఈ-5 రోడ్డు కింద ఇళ్లు, స్థలాలు కోల్పోతున్నారు. ఇటీవల సీఆర్డీఏ అధికారులు సర్వే చేసి వివరాలను అందజేశారు. రోడ్డు కింద వదిలేయాటానికి సిద్ధమేనని అయితే మేరిమాత స్కూల్ ఎదురు స్థలంలో ఇవ్వాలని నిర్వాసితులు కోరుతున్నారు. గ్రామానికి అనుకొని ఒకే చోట స్థలాలు కేటాయించాలని సమావేశంలో తీర్మానం చేశారు. మెరుగైన ప్యాకేజీ అమలుచేయాలని కోరారు.

మెడికల్ ప్రాక్టీషనర్స్ కార్యవర్గం ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ ప్రతినిధులు


మంగళగిరి, మే 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండల రిజి స్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా కొల్లి నాగేశ్వరరావు, కార్యదర్శిగా ఆర్ సత్యనారాయణ, కోశాధికారిగా సీహెచ్ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జేఎం గోపాల్, ఉపాధ్యక్షుడిగా కరీముల్లా, మరికొంత మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పన్ను వసూళ్లపై ఉన్న శ్రద్ధ పారిశుధ్య మెరుగుదలపై ఉండదా?

● కార్యదర్శిపై గ్రామస్థుల ఆగ్రహం

పెదనందిపాడు, మే, 17 (ఆంధ్రజ్యోతి): పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ గ్రామంలో పారిశుధ్యం మెరుగుదలపై ఉండదా అని పెదనందిపాడుకు చెందిన గ్రామస్థులు కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో తాగునీరు లేదని, మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, అధికారులు గ్రామాల్లో తిరిగితే సమస్యలు తెలుస్తాయన్నారు. ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ అవి కేవలం మొక్కుబడిగా చేస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో కనపడడం లేదన్నారు. రోడ్ల వెంట నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నామని, దట్టంగా ముళ్ల కంపలు చెట్లు పెరిగి ఉన్నాయని, సైడు కాల్వలు లేకపోవడం వలన కొద్దిపాటి వర్షాలకే రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తుందని దీని వల్ల దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. గ్రామంలోకి విడుదల చేసే నీటిలో పురుగుల వస్తున్నాయని, క్లోరినేషన్ చేసి నీటిని సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుమ్మల సీతారామయ్య, కందుల సుబ్బారావు,. ధూళిపాళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రపై నిర్లక్ష్యపు నీడలు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెదనందిపాడు, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రతినెలా మూడో శనివారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమానికి శని..పడుతుంది. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులను, ప్రజలను భాగస్వాములుగా చేస్తూ మూడు నెలల క్రితం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ప్రతి నెలలో ఒక కార్యక్రమాన్ని చేపట్టాలని అధికారులకు ముందుగా దిశానిర్దేశం చేస్తారు. అధికారులు ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రజలను పిలిపించి, అవగాహన కల్పించి, ప్రధాన రహదారిలో శుభ్రం చేయడం, కాలువలు బాగుచేయడం వంటివి చేసి ప్రతిజ్ఞ చేయిస్తారు. కానీ రాష్ట్రస్థాయిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎంలు సైతం ప్రతి నెలా ఈ కార్యక్రమం నిర్వహిస్తుంటే క్షేత్రస్థాయిలో మాత్రం అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా కార్యక్రమం అమలు అభాసుపాలవుతుంది. ఉన్నతాధికారులు కార్యాలయాలకే పరిమితమవడంతో స్వచ్ఛసంకల్పం చిన్నబోతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్యక్రమాలు అభాసుపాలు కాకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

30 నుంచి గుంటూరు ఓపెన్ టెన్నిస్ పోటీలు

గుంటూరు(తూర్పు), మే 17(ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్ స్టేడియంలో ఈనెల 30 నుంచి మూడు రోజుల పాటు అండర్ 16, బాల, బాలికలు విభాగంలో గుంటూరు, ఓపెన్ టెన్నిస్ పోటీలు నిర్వహిస్తున్నట్టు టోర్నమెంట్ డైరెక్టర్ నాగేంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ ఎంట్రీలను ఈనెల 28లోపు బీఆర్ స్టేడియం టెన్నిస్ కోచ్ అహ్మద్‌కు పంపాలని కోరారు. పోటీలలో పాల్గొనే వారు విధిగా జనన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురావాలన్నారు. క్రీడాకారులకు అల్పాహారాన్ని, విజేతలకు నగదు బహుమతులను అందజేయనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 98483 27654, 94934 00111 అనే నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ అదాలత్‌లో సమస్యలు పరిష్కారం

తుళ్లూరు(రాయపూడి), మే 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాయపూడి విద్యుత్ భవనంలో శనివారం జరిగిన విద్యుత్ అదాలత్‌లో 12 సమస్యలకు సత్వర పరిష్కారం జరిగాయి. సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానేయేలు అదాలత్ గురించి వివరించారు. ఈ అదాలత్‌లకు తాడికొండ, తుళ్లూరు, అమరావతి మంగళగిరి, తాడేపల్లి మండలాల పరిధిలోగల విద్యుత్ వినియోగదారులు తమ దీర్ఘకాల సమస్యలను పరిష్కరించుకున్నారు. తుళ్లూరు, రాయపూడి, మందడం గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యలున్నట్లు ఇమ్మానేయేల్ దృష్టికి రాగా, ఆయా ఏఈలతో మాట్లాడగా ట్రాన్స్‌ఫార్మర్ల కొరత ఉన్నట్టు, వాటిని 15 రోజుల్లోపు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమం లో సాంకేతిక సభ్యులు ఎస్ శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యులు ఆర్ సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు సునీత, స్థానిక సీఆర్డీఏ ఎస్ఈ పీ సుబ్రహ్మణ్యం, ఈఈ జే.సంజీవరావు, డీఈఈ కె.కోటేశ్వరావు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్ దీక్ష విరమణ

మంగళగిరి, మే 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ మంగళగిరి డిపో కార్యదర్శి వి.నాగేశ్వరరావును విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలను శనివారం సాయంత్రం విరమించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో యాజమాన్యం నిరంకుశ వైఖరితో నాగేశ్వరరావును విధుల నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ మూడు రోజులుగా చేస్తున్న దీక్షలు ఫలించాయన్నారు. డిపో యాజమాన్యం స్పందించి యూనియన్ నేతలతో జరిపిన చర్చలు సఫలం కావడంతో దీక్షలు విరమించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, నేతలు కరీముల్లా, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాగులపాడు టీడీపీ అధ్యక్షుడిగా బండి



బండి నాగబాబు

పెదనందిపాడు, మే 17(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని నాగులపాడులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద శనివారం రాత్రి టీడీపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా ప్రస్తుతం కొనసాగుతున్న బండి నాగబాబును మరలా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, నాయకులు పాటిబండ్ల నాగరాజు, పోపూరి నాగేశ్వరరావు, పాటిబండ్ల మురళీ, నార్ల వెంటేశ్వర్లు, పాటిబండ్ల నాగబాబు, ఆళ్ల ఫణిబాబు, బండి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

20న జరిగే నిరసనను జయప్రదం చేయాలి

తాడేపల్లి (వడ్డేశ్వరం), మే 17 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై మే 20న జరుగు నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్మిక సంఘాల పిలుపులో భాగంగా వడ్డేశ్వరంలోని కేబీ భవన్‌లో శనివారం రైతు కార్మిక సంఘాల నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్ మాట్లాడుతూ సుదీర్ఘ పోరాట ఫలితంగా మూడు చట్టాలను రద్దు చేస్తున్నామని ప్రకటన చేసి తిరిగి మళ్లీ వాటిని అమలు చేసేందుకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతి రేక విధానాలకు నిరసనగా రైతులు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మే 20న నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

స్వచ్ఛభారత్‌లో అందరూ భాగస్వాములు కావాలి



స్వచ్ఛభారత్‌పై తుళ్లూరులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

తుళ్లూరు, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ స్వచ్ఛ భారత్‌లో భాస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. తుళ్లూరులో వైద్య అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌పై ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి పరిసరాలను ఆరోగ్య సిబ్బందితో కలసి శుభ్రం చేశారు. శనివారం రక్తపోటు నియంత్రణ దినోత్సవం సందర్భంగా వైద్యుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆహార విధానం, జీవన శైలీలో మార్పు, శారీరక శ్రమ తప్పక చేసి బీపీ నియంత్రణ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, సూపర్‌వైజర్లు ఎన్ సుధాకర్, కే నరసింహారావు, హెల్త్ అసిస్టెంట్ ఎస్కే. కరీమ్, ఏఎన్‌ఎంలు, ఆశాలు సిబ్బంది పాల్గొన్నారు. పెదపరిమి పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

● ఫిరంగిపురం, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురంలో స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించి సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడా బాబు, ఏపీఎం నాగేశ్వరరావు, ఈవో ఏ కిషోర్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో నిబంధనలు పాటించాలి : జాయింట్ కంట్రోలర్

గుంటూరు(తూర్పు), మే 17(ఆంధ్రజ్యోతి) : పెట్రోల్ బంకుల్లో ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను విధిగా పాటించాలని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ ఎస్ఎస్ మాధురి అన్నారు. మెట్రాలజీ డే కార్యక్ర మాల్లో భాగంగా శనివారం పలకలూరు రోడ్డులోని గుంటూరు క్లబ్‌లో పెట్రోలియం డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లా డుతూ పెట్రోల్ నాణ్యతపై అనుమానం ఉంటే ఫిల్టర్ పేపర్ ద్వారా వినియోగదారులు పరిశీలించుకోవాలన్నారు. అమ్మకాలకు ముందు 5లీటర్ల కొనికల్ మెజర్‌తో నాజిల్‌ను తనిఖీ చేసుకుని, తేడా గమనించినట్లయితే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.

శ్రీమహంకాళీ అమ్మవారికి సారె సమర్పణ

● మొక్కు తీర్చుకున్న చిలువూరు గ్రామస్థులు

● కాలినడకన చేరుకున్న 200 మంది మహిళలు



శ్రీమహంకాళీ అమ్మవారికి సారెను సమర్పించేందుకు ఊరేగింపుగా బయలుదేరిన గ్రామస్థులతో టీటీడీ సభ్యురాలు జానకీదేవి, శ్రీఅనిత తదితరులు

దుగ్గిరాల, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన దుగ్గిరాల మండలం కేఆర్ కొండూరు గ్రామం శ్రీమహంకాళీ అమ్మవారికి సారెను సమర్పించి తమ మొక్కును తీర్చుకున్నారు. చిలువూరులోని శివాలయం నుంచి 200 మందికి పైగా మహిళలు, ఊరేగింపుగా 4కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయానికి కాలినడకన బయలుదేరారు. పూలతో అలంకరించిన వాహనంపై నూతన వస్త్రాలు, గాజులు, పలురకాల పూలు, పసుపు, కుంకుమలు పలురకాల పండ్లతో నింపిన వాహనంతో ప్రారంభమైన ఊరేగింపు గ్రామ వీధుల్లో కనక తప్పెట్లు, మంగళవాయిద్యాలతో మహంకాళీ అమ్మవారి ఆలయం వరకూ ఊరేగింపుగా తరలివచ్చారు. మంగళవాద్యాలు, మేళతాళాలతో జరిగిన ఊరేంపుతో గ్రామం హోరెత్తింది. శ్రీకాళీకాదేవి అవతారంలో నృత్య రీతులతో భక్తులను కళాకారులు అలరించారు. గ్రామస్థులు అమ్మవారికి సారెను సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈవో కోగంటి సునీల్‌కుమార్, వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్‌లు భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మొక్కుకున్నాం

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుని, అమ్మవారికి సారెను సమర్పించామని, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి అన్నారు. జానకీదేవి, మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, చిలువూరు గ్రామస్థులతో కలిసి అమ్మవారి ఆలయం వరకూ తరలివెళ్లి సారెను అమ్మవారికి సమర్పించారు. జానకీదేవి, శ్రీఅనితలు మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ చొరవతోనే శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు త్వరగా పూర్తయ్యాయని అన్నారు.

ప్రపంచ గుండెపోటు దినోత్సవ ర్యాలీ



దుగ్గిరాలలో ప్రపంచ గుండెపోటు దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ ఇజాజ్‌అబ్దుల్‌రహ్మాన్, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది

దుగ్గిరాల, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయుర్‌మందిర్‌లలో ప్రతి నెలా రక్తపోటు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని దుగ్గిరాల పీహెచ్‌సీ డాక్టర్ ఇజాజ్ అబ్దుల్‌రహ్మాన్ తెలిపారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలిసి గుండెపోటుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దుగ్గిరాల పీహెచ్‌సీ నుంచి మెయిన్‌రోడ్ మీదుగా పోలీస్‌స్టేషన్ వరకూ ర్యాలీ కొనసాగించారు. బీపీ పరీక్షల కోసం వచ్చిన వారికి పరీక్షలు జరిపి ఉచితంగా నెల రోజులకు సరిపడా మందులు అందిస్తున్నామన్నారు. డీపీవో సాయికుమార్, సర్పంచ్ కుషీబాయి, ఈవో కే వివేకానంద, టీడీపీ నాయకులు గూడూరు వెంకట్రావు, గద్దె శ్రీనివాస్, పర్వతనేని హర్ష, నక్కా చిరంజీవి, శ్రీనివాస్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ స్వాధీనానికి పంచాయతీ ఆమోదం

ప్రత్తిపాడు, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు రక్షిత మంచినీటి పథకం వద్ద నున్న వాటర్ ప్లాంట్‌ను స్వాధీన పరుచుకునేందుకు సభ్యుల తీవ్ర వాదోపవాదాల నడుమ పంచాయతీ తీర్మానం చేసింది. పంచాయతీ సర్వసభ్య సమావేశం సర్పంచ్ రమాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా వాటర్ ప్లాంట్‌ను స్వాధీన పరుచుకుని బహిరంగ వేలం నిర్వహించాలంటూ వార్డు మెంబరు డబ్బూరి కొండ అంశాన్ని లేవనెత్తాడు. దీనిపై మరో వార్డు మెంబర్లు కాకాని సురేష్, మల్లం పరమేశ్వరరావులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై కొద్ది సేపు వాదోపవాదాలు జరిగాయి. పంచాయతీకి ఆదాయం రావాలని చాలా కాలంగా ఒకరే నిర్వహిస్తున్నారంటూ, వారికి కూడా పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. తాగునీరు, పారిశుధ్యం విషయాలపై వార్డు సభ్యులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కార్యదర్శి ఖాజా తదితరులు పాల్గొన్నారు.